RNI : APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 22, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 2, /- శనివారం - 25 - ఏప్రిల్ - 2026

published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Vishakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana

## గాలి పీల్చుకోవడానికి రాలేదు.. ఎవర్ని కలిశానో చెప్పను



### సస్పెన్స్‌లో డీకే ఢిల్లీ పర్యటన

ఢిల్లీ పర్యటనలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే

2లో

## మహిళా బిల్లును అడ్డుకున్న ఇండియా కూటమిపై నిరసనలు చేపట్టాలి



2లో

- ఈ నెల 30లోగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఆందోళనలు చేయాలని ఆదేశం
- 'స్త్రీ శక్తి' పేరుతో సదస్సులు నిర్వహించి వాస్తవాలు వివరించాలని సూచన

## శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు..



2లో

### రేవంత్ సర్కార్ చేసిన హత్య

- ఈ ఉదయం మృతి చెందిన శంకర్ గౌడ్
- పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు అనుమతించకపోవడం దుర్మార్గమన్న కేటీఆర్



## ఫేక్ వీడియోలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు


- సీఎం హామీపై దుష్ప్రచారం.. ఫేక్ వీడియోలపై మంత్రి లోకేష్ సీరియస్ వార్నింగ్
- సీఎం చంద్రబాబు హామీపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన మంత్రి నారా లోకేష్
- బ్యాటరీ ఆటో హామీపై అసలు వాస్తవాలను వెల్లడించిన ప్రభుత్వం

2లో

# ద్వాక్రా మహిళలు కూడబెట్టుకున్న రూ.1194 కోట్లను మళ్లించిన వైకాపా

## 22 లక్షల మందికి 'అభయ'హస్తం

### అప్పట్లో తమ డబ్బు ఇవ్వాలన్నా పట్టించుకోలేదు తాజాగా తిరిగి ఇచ్చేందుకు ఆర్థికశాఖ అంగీకారం



అమరావతి: అభయహస్తం పింఛను కోసం దాదాపు 12 ఏళ్ల పాటు డ్వాక్రా మహిళలు పొదుపు చేసుకున్నారు. ఇలా కూడబెట్టుకుంది ఒకరో ఇద్దరో కాదు. 22 లక్షల మంది. జమ చేసుకున్న మొత్తం రూ.1194 కోట్లకు చేరింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కలిపిన మరో రూ.1,000 కోట్లు అదనం. అంటే మొత్తం రూ.2,194 కోట్లు. ప్రతినెలా ఇది పెరిగేదే తప్ప తరిగేది కాదు. కానీ 2019-24 మధ్య ఎక్కడ పడితే అక్కడ.. ఏవి పడితే అవి తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన వైకాపా ప్రభుత్వం అభయహస్తం నిధులనూ వదల్లేదు. మిగతా..2లో



## రాజకీయ పోరాటాలు చేశాను కానీ నేరగాళ్లతో పోరాడటం కొత్తగా ఉంది ఇది నాకు కూడా కొత్తగానే ఉంది

### టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్‌ల శిక్షణ శిబిరానికి హాజరైన పార్టీ అధినేత చంద్రబాబు

అమరావతి: "నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను కానీ, నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి రావడం నాకు కూడా కొత్తగానే ఉంది" అంటూ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ ఇంఛార్జ్‌ల శిక్షణా తరగతుల్లో భాగంగా ఏర్పాటు చేసిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలపై పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. వైసీపీని ఒక 'కిల్లర్ పార్టీ'గా అభివర్ణించిన చంద్రబాబు, ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని మిగతా..2లో



## తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఇంకా మిగిలే ఉన్నాయి

- బీఆర్ఎస్ పార్టీపై మరోసారి విమర్శలు గుప్పించిన కవిత
- బీఆర్ఎస్ పార్టీ పేరుతో పాటు ఆత్మను కూడా మార్చుకుందని విమర్శ
- మూల సిద్ధాంతం నుంచి తప్పుకుంటే పార్టీ మనుగడ సాగించలేదన్న కవిత

2లో

## ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ...

### లిఖితపూర్వక హామీకి జేఏసీ నేతల డిమాండ్

- సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, లక్ష్మణ్
- శంకర్ గౌడ్ మృతిపట్ల మంత్రులు, జేఏసీ నేతల సంతాపం
- 29 అంశాలకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపిన మంత్రులు
- మూడు అంశాలపై అధ్యయనం చేయాలన్న మంత్రులు



హైదరాబాద్: తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ భేటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, మిగతా..2లో

## మొదటి దశలో 110 స్థానాలను గెలుస్తాం

మమత దిగిపోయే సమయం వచ్చింది..

బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తుంది: అమిత్ షా

బెంగాల్ ప్రజలు తమ భవిష్యత్తును తొలి దశలోనే నిర్ణయించుకున్నారని వెల్లడి

బీజేపీ నుంచి బెంగాలీయే ముఖ్యమంత్రి అవుతారని స్పష్టీకరణ



ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మొదటి దశలో 152 స్థానాలకు పోలింగ్ జరిగిందని, ఇందులో 110కి పైగా స్థానాలను తాము గెలుచుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జరిగిన విలేకరుల మిగతా..2లో



2లో

## కొత్త ఏఐ 'మిథోస్' కలకలం.. బ్యాంకర్లకు నిర్మలా సీతారామన్ హెచ్చరిక

'క్లాడ్ మిథోస్' అనే కొత్త ఏఐ సైబర్ భద్రతకు ముప్పుగా మారింది

నిర్మలా సీతారామన్ బ్యాంకర్లతో ఉన్నతస్థాయి సమావేశం

దశాబ్దాల నాటి లోపాలను సైతం ఈ ఏఐ గుర్తించగలదని నిపుణుల హెచ్చరిక



## గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదు

### తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి అని ఆరోపణ

- బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారన్న మోదీ
- బీజేపీ ప్రభుత్వం వచ్చాక టీఎంసీ దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్ బయటకు తీస్తామన్న మోదీ
- మే 4 ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలకు దాక్కోవడానికి చోటు దొరకదు

ఢిల్లీ: మే 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మిగతా..2లో

# రూ.6,200 కోట్ల బకాయిలు.. 100 రోజుల్లో చెల్లింపు

## మంత్రులు, ప్రజాప్రతినిధుల వేతనాల్లో 50 శాతం నిలిపివేత

- విశ్రాంత ఉద్యోగులకు శుభవార్త
- రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఆ నిధుల వెచ్చింపు
- త్వరగా సమస్య పరిష్కారానికి 'రెవెన్యూ రిసోర్సెస్ మొబిలైజేషన్ కమిటీ'
- మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించిన పొంగులేటి




హైదరాబాద్: రాబోయే 100 రోజుల్లోగా విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,200 కోట్ల బకాయిలు చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రులు, కొందరు ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీతాల్లో 50 శాతం నిలుపుదల చేసి.. వాటిని రిటైర్డ్ ఉద్యోగుల మిగతా..2లో



2లో

## వ్యోమగాముల వింత సమస్య..స్పేస్ నుంచి తిరిగొచ్చాక చేతి నుంచి వస్తువులు ఎందుకు జారిపోతాయి?

అంతరిక్షం నుంచి వచ్చాక వస్తువులు పట్టుకోవడంలో వ్యోమగాముల ఇబ్బందులు

గురుత్వాకర్షణ శక్తిని మెదడు తేలికగా మర్చిపోదని తేల్చిన పరిశోధన

## బిజెపిలో చేరిన రాఘవ చద్దా సహా ఆరుగురు ఆప్ ఎంపిలు



న్యూఢిల్లీ : రాజ్యసభ సభ్యులు రాఘవ చద్దా సహా ఆరుగురు ఆప్ ఎంపిలు బిజెపిలో చేరారు. రాఘవ చద్దాను ఇటీవల ఆప్ పార్టీ నుండి తొలగించిన సంగతి తెలిసిందే. సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ లతో కలిసి రాఘవ చద్దా శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాజ్యసభలో ఆప్ కి చెందిన 2/3వంతు సభ్యులమైన తాము భారత రాజ్యాంగ నిబంధనలను వినియోగించి బిజెపిలో విలీనం కావాలని నిర్ణయించుకున్నామని అన్నారు. 15 పాటు ఆప్ అభివృద్ధికి కృషి చేశామని, ఇప్పుడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, నైతికత, విలువల నుండి పక్కకు తప్పుకుందని అన్నారు. ప్రస్తుతం ఆప్ దేశ ప్రయోజనాల కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. ఈరోజు ఆప్ పార్టీకి దూరమవుతూ ప్రజలకు దగ్గరవుతున్నానని చెప్పుకొచ్చారు. సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ లు కూడా ఆప్ పార్టీకి రాజీనామా చేశారు. తాము సంతకం చేసిన పత్రాలు, లేఖలను రాజ్యసభ చైర్మన్ కు సమర్పించామని అన్నారు. పార్టీని వీడిన వారిలో హర్భజన్ సింగ్, రాజేందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ, స్వాతి మలివాల్ లు కూడా ఉన్నారు.ద

## సిఇసి జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలంటూ ప్రతిపక్షాల తీర్మానం




న్యూఢిల్లీ : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని కోరుతూ ప్రతిపక్షాలు శుక్రవారం తీర్మానాన్ని సమర్పించాయి. ప్రతిపక్షాలు ఇటువంటి తీర్మానాన్ని సమర్పించడం ఇది రెండవసారి. ఈ తీర్మానంపై కాంగ్రెస్ నేత జైరాం రమేష్, టిఎంసి నేత సాగరికా ఘోష్ సహా 11 ప్రతిపక్ష పార్టీలకు చెందిన 73మంది రాజ్యసభ ఎంపిలు సంతకాలు చేశారు. ఈ తీర్మానంలో జ్ఞానేష్ కుమార్ పై తొమ్మిది అభియోగాలు నమోదయ్యాయి. ఈ సారి లోక్ సభలో నోటీసు దాఖలు చేయాలా వద్దా అనే అంశంపై ప్రతిపక్షాలు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. గతంలో ఇచ్చిన మొదటి తీర్మానంపై 63మంది రాజ్యసభ ఎంపిలు, 130మంది లోక్ సభ ఎంపిలు సంతకాలు చేయగా, ఏడు అభియోగాలు నమోదైన సంగతి తెలిసిందే.

## ఖమేనీని హత్య చేసినందుకు ట్రంప్ క్షమాపణలు చెప్పాలి

### - ఇరాన్ మత గురువు అలీ షిరాజీ డిమాండ్



టెహ్రాన్ : ఫ్రిబవరి 28వ తేదీన అమెరికా -- ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి చెందారు. దారుణంగా ఖమేనీని హతమార్చినందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, తమ నాయకుడిని చంపడం పొరపాటని ట్రంప్ ప్రపంచం ముందు ఒప్పుకోవాలని ఇరాన్ సీనియర్ మత గురువు అలీ షిరాజీ శ్రుకవారం డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ పట్ల శత్రుత్వం అనేది ఖురాన్‌కు సంబంధించిందనీ, అది మార్పులేని సూత్రం అని ఆయన అన్నారు. అలాగే, శత్రువు (అమెరికా) తీసుకునే ఏ చర్యకైనా గట్టిగా ప్రతిస్పందించడానికి ఇరాన్ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

## ఇష్రత్ జహాన్ బెయిల్ పై ఢిల్లీ పోలీసుల పిటిషన్ కొట్టివేత




న్యూఢిల్లీ : 2020 ఢిల్లీ అల్లర్ల వెనుక భారీ కుట్ర కేసులో మాజీ కాంగ్రెస్ కౌన్సిలర్ ఇష్రత్ జహాన్ కు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. 2022 మార్చి 14న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ రవీందర్ దుడేజాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్ ను కొట్టివేసింది. నాలుగేళ్ల క్రితం బెయిల్ మంజూరైందని, గణనీమైన కాలం గడించిందని, ప్రతివాది తన బెయిల్ షరతులను ఉల్లంఘించినట్లు ఆరోపణ లేదని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను జోక్యం చేసుకోవడానికి కోర్టు సుముఖంగా లేదని, దీంతో పిటిషన్ ను కొట్టివేస్తున్నామని తెలిపింది. కేసు స్థితిపై తాము ఎటువంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదని స్పష్టం చేసింది. మరో నిందితుడి కేసు సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉందని, ఆ తీర్పు ప్రస్తుత అప్పీలుపై ప్రభావం చూపవచ్చని ఢిల్లీ పోలీసుల తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి. రాజు కోర్టుకు తెలిపారు. ఈ అప్పీల్ పై చర్చించేందుకు ధర్మాసనం తిరస్కరించింది. 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన అల్లర్లకు సూత్రధారులుగా ఉన్నారని ఆరోపిస్తూ ఇష్రత్ జహాన్, ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ సహా పలువురిపై యుఎపిఎ చట్టం కింద కేసు నమోదైంది.

## ముమ్మిడివరం లో హోటల్స్ తనిఖీ

ముమ్మిడివరం,మహి న్యూస్, ఏప్రిల్ 24.: ముమ్మిడివరం పలు హోటల్స్ పై నగర పంచాయతీ కమిషనర్ పి. రవి వర్మ ఆకస్మిక తనిఖీ చేశారు.సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం, పరిశుభ్రత పాటించక పోవడం కారణం తో వీరభద్ర, శ్రీ లక్ష్మి, వెంకట గణేష్ హోటల్స్ లో తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వర్తకులకు రూ. 500 జరిమానా విధించారు. ఇదే విధంగా తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ రవి వర్మ హెచ్చరించారు.


## ట్రంప్ ప్రకటన కొన్ని గంటల్లోపే లెబనాన్ పై ఇజ్రాయిల్ వైమానిక దాడులు



లెబనాన్ : లెబనాన్ పై ఇజ్రాయిల్ భీకర దాడులు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లెబనాన్ -- ఇజ్రాయిల్ కాల్పుల విరమణ మూడువారాలు పొడిగిస్తున్నట్లు శ్రు కవారం ప్రకటించారు. అయితే ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోపే ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడిఎఫ్) దక్షిణ లెబనాన్లో ఒక రాకెట్ లాంచర్ పై దాడి చేశాయి. ఈ దాడిలో ప్రాణ నష్టానికి సంబంధించిన సమాచారం ఇప్పటివరకు వెల్లడికాలేదని ఐడిఎఫ్ టెలిగామ్ ప్రకటన ద్వారా పేర్కొంది.

# డేటా వార్!.. కేబుళ్లను కత్తిరిస్తామంటూ ఇరాన్ హెచ్చరిక

### సముద్రంలోని కేబుళ్లను కత్తిరిస్తామంటూ ఇరాన్ హెచ్చరిక
### ఇదే జరిగితే ఆర్థిక, సమాచార వ్యవస్థలకు తీవ్ర ఆటంకం
### భారత ఇంటర్నెట్ సేవలకు కీలకంగా హార్ముజ్ జలసంధి



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో.. పర్షియన్ గల్ఫ్‌లోని కీలక డిజిటల్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా దాడులు జరగొచ్చని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కారప్స్ (ఐఆర్‌జీసీ) బాంబు పేల్చింది. సముద్రంలోని ఈ కేబుల్స్ ద్వారానే ప్రపంచంలోని అత్యధిక ఇంటర్నెట్ ట్రాఫిక్ ప్రయాణిస్తోంది. కేబుల్స్‌కు ముప్పు వాటిల్లితే నష్ట ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉండనుంది. చాలా దేశాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలుగా మారిన నేపథ్యంలో ఈ పరిస్థితి ఆందోళనకరమైనదే. హార్ముజ్ జలసంధి గుండా వెళ్లే కీలక సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను, వాటికి ఉన్న ముప్పును ఐఆర్‌జీసీకి అనుబంధంగా ఉన్న తస్నీమ్ వార్తా సంస్థ ప్రచురించిన నివేదికలో వివరించింది. ఇంధన రవాణాకే గాక ప్రపంచ డేటా ప్రవాహానికీ ఈ జలసంధి అత్యంత కీలక మార్గమని స్పష్టం చేసింది. గల్ఫ్ దేశాలు ఇంటర్నెట్ కనెక్టివిటీ కోసం ఈ సముద్ర కేబుల్ వ్యవస్థలపైనే ఆధారపడుతున్నాయని నొక్కి చెప్పింది. కేబుళ్ల ల్యాండింగ్ స్టేషన్స్, క్లౌడ్ హబ్‌లను శత్రువుపై ఒత్తిడి పెంచే వ్యూహాత్మక కేంద్రాలని తెలిపింది. ఎలాంటి అంతరాయం కలిగినా ఆయా దేశాల ఆర్థిక, సమాచార వ్యవస్థలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని హెచ్చరించింది. గల్ఫ్ దేశాల్లో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ డేటా సెంటర్లు కేంద్రీకృతమై ఉన్నాయి.

### మూల స్తంభాలుగా..

ఎర్ర సముద్రం, హార్ముజ్ జలసంధి గుండా సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్ భారీ నెట్‌వర్క్ ఉంది. ఇది ఆసియా, యూరప్, ఆఫ్రికా మధ్య కీలక అనుసంధానంగా నిలుస్తుంది. పశ్చిమ దేశాలతో భారత్‌ను అనుసంధానించే ఐదు ప్రధాన సముద్రగర్భ కేబుల్ వ్యవస్థలు మన దేశ డిజిటల్ కమ్యూనికేషన్లకు మూల స్తంభాలుగా ఉన్నాయి. వీటిలో ఫాల్కన్ నెట్‌వర్క్, ఆసియా--ఆఫ్రికా--యూరప్--1, టాటా టీజీఎన్--గల్ఫ్, సౌత్ఈస్ట్ ఆసియా--మిడిల్ ఈస్ట్--వెస్టర్న్ యూరప్--4, ఇండియా--మిడిల్ ఈస్ట్--వెస్టర్న్ యూరప్ ఉన్నాయి. కేవలం ఎర్ర సముద్రం గుండానే 15--20 కేబుల్స్ వెళు తున్నాయి. రిలయన్స్ అభివృద్ధి చేస్తున్న ఇండియా--యూరప్--ఎక్స్‌ప్రెస్, ఇండియా--ఆసియా--ఎక్స్‌ప్రెస్, గూగుల్‌కు చెందిన ధివారు సముద్ర కేబుల్ ప్రాజెక్టులు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి.

### సేవలకు అంతరాయం..

ఒకటి లేదా రెండు కేబుల్స్ దెబ్బతింటే ఆ అంతరాయాన్ని సాధారణంగా సరిచేయొచ్చు. అనేక కేబుల్స్ తెగిపోతే ఇంటర్నెట్ వేగం తగ్గడం, వెబ్‌సైట్స్ పనిచేయకపోవడం, బ్యాంకింగ్, క్లౌడ్ సిస్టమ్స్, డిజిటల్ పేమెంట్స్ వంటి సేవలపై తీవ్ర ప్రభావం పడుతుంది. మన దేశంలోని ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో సుమారు 60% ముంబై నుంచి గల్ఫ్ ప్రాంతం మీదుగా యూరప్ వైపు వెళ్లే మార్గాల ద్వారానే ప్రయాణిస్తుంది. మిగిలిన ట్రాఫిక్ చెన్నై నుంచి సింగపూర్ మీదుగా పసిఫిక్ మహాసముద్రం వైపు సాగే మరో మార్గం ద్వారా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల నుంచి ఆసుపత్రి డేటా వరకు అన్నీ 'క్లౌడ్'లో భద్రపరచి ఉన్నాయి. కనెక్టివిటీ పోతే ఈ సేవలు పూర్తిగా నిలిచిపోతాయి. భారత్ ఒక 'డిజిటల్ ద్వీపం' లాంటిది. మన అంతర్జాతీయ డేటాలో 97% సముద్ర మార్గాల ద్వారానే ప్రయాణిస్తుంది.

### మరమ్మతులకు నెలలు..

తరచుగా నౌకల లంగర్ల వల్ల జరిగే ప్రమాదవశాత్తు నష్టాలు కూడా ఇంటర్నెట్ అంతరాయాలకు కారణమవుతాయి. భారీ స్థాయిలో నష్టం జరిగితే వాటిని సరిచేయడానికి వారాలు లేదా నెలల సమయం పట్టవచ్చు. 2024, 2025లో ప్రాంతీయ ఉద్రిక్తతల సమయంలో ఎర్ర సముద్రంలోని పలు సముద్రగర్భ కేబుల్స్ దెబ్బతిన్నాయి. దీనివల్ల ఇంటర్నెట్ వేగం తగ్గడంతోపాటు అనేక దేశాల్లో సేవలకు అంతరాయం కలిగింది. ఆ ప్రాంతంలోకి ప్రవేశం పరిమితంగా ఉండటం వల్ల మరమ్మతులు చేయడానికి నెలలు పట్టింది.

### రిస్క్ అనాలసిస్..

రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, టాటా కమ్యూనికేషన్స్, వొడాఫోన్ ఐడియా వంటి టెలికం దిగ్గజాలు తమ అంతర్జాతీయ డేటా ప్రసారం కోసం ఈ హార్ముజ్ జలసంధి, ఎర్ర సముద్ర మార్గాలపైనే పూర్తిగా ఆధారపడుతున్నాయి. హార్ముజ్ గుండా వెళ్లే కేబుల్స్‌కు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా చూడటానికి ఇరాన్ ప్రభుత్వంతో దౌత్యపరమైన చర్చలు జరపాలని ఈ సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. ఈ విజ్ఞప్తుల నేపథ్యంలో టెలికం శాఖ ఆపరేటర్లందరినీ తమ డేటా మార్గాల భద్రతపై 'రిస్క్ అనాలిసిస్' నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఒకవేళ కేబుల్స్ దెబ్బతింటే డేటాను ప్రత్యామ్నాయ మార్గాల (సింగపూర్ లేదా పసిఫిక్ రూట్) ద్వారా ఎలా మళ్లించాలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే సూచించింది.

# కీలక పోరుకు సిద్ధం



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ల భవితవ్యాన్ని తేల్చబోయే పోలింగ్‌కు అంతా సిద్ధమైంది. 294 అసెంబ్లీ నియోజకవర్గాలున్న బెంగాల్‌లో గురువారం తొలి దఫాలో 152 స్థానాలకు పోలింగ్ జరగబోతుండగా, ఈ నెల 29న మరో 142 స్థానాలకు పోలింగ్ ఉంటుంది. తమిళనాట మాత్రం మొత్తం 234 స్థానాలకూ ఒకే దఫాలో పోలింగ్ పూర్తవుతుంది. తమిళనాడులో చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికల పర్వం ఎప్పుడూ ప్రశాంతమే. బెంగాల్‌లో మాత్రం మహోద్రిక్త వాతావరణమే అలుముకుంటుంది. పార్టీల వైరం సరేగానీ... ఎన్నికల సంఘం(ఈసీ) సైతం ఈ ఉద్రిక్తతలకు దోహదపడటం కొత్త పరిణామం. జనం తమవెంటే ఉన్నారా లేదా... వ్యూహం, ఎత్తుగడలూ కుదిరాయా లేదా అని పార్టీలు ఆత్ర పడటం సహజం. సాధారణ జనంలో సైతం కాబోయే విజేతలెవరు, పరాజితులెవరన్న ఆత్రుత ఉండితీరుతుంది. కానీ బిహార్ అనుభవం తర్వాతైనా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను లోపరహితంగా పూర్తిచేద్దామన్న ఆత్రుత ఈసీలో లేకుండా పోయింది. అందువల్లే బెంగాల్‌లో 91 లక్షలమంది, తమిళనాడులో 70 లక్షలమంది ఓటర్లలో ఈసారి ఓటు వేయగలమా లేదా అన్న ఆందోళన ఏర్పడింది. బెంగాల్‌లో ట్రిబ్యునళ్లలో అప్పీల్ దాఖలు చేసి విజయం సాధించినవారికి ఓటేసే అవకాశం ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చినా ఇంత తక్కువ వ్యవధిలో ఎందరికి ఆ వరం దక్కుతుందో అనుమానమే. 'స్వచ్ఛమైన' ఎన్నికల జాబితాతో పోలింగ్ జరిపితీరాలన్న ఈసీ దృఢ నిశ్చయాన్ని తప్పుబట్టాల్సిన పని లేదు. అందుకోసం 'సర్' తీసుకొచ్చారు. కానీ పోలింగ్ తేదీలు ప్రకటించే నాటికి సైతం ఒక కొలిక్కి రాకపోవటం, సాధారణ జనం నానా హైరానా పడటం ఈసీ అసమర్థతకు అద్దం పట్టింది. పోలింగ్‌కు 48 గంటల ముందు కూడా ఓటుహక్కు ఉంటుందో, ఊడుతుందో తెలియనివారు అనేకులు. ఓటర్లకూ, వారి తల్లిదండ్రులకూ వయసు వ్యత్యాసం 15 ఏళ్లకన్నా తక్కువ లేదా 50 ఏళ్లకు మించి ఉంటే... ఒకే జంటకు ఆరుగురు, అంతకన్నా ఎక్కువమంది సంతానం ఉంటే... ఇంగ్లిష్‌లో ఉన్న పాత రికార్డుల్లోని పేర్లకూ, ఇప్పుడు నమోదైన పేర్లకూ మధ్య అక్షరం తేడా ఉంటే... ఓటరు వయసుకూ, వారి తాత, నాయనమ్మ లేదా అమ్మమ్మ వయసులకూ మధ్య 40 ఏళ్లకన్నా తక్కువుంటే ఈసీ వాడిన క్రమసూత్ర పద్ధతి (అల్గోరిథమ్) పొరపాటుగా పరిగణించింది. ఇది మానవ తప్పిదమైనా ఎప్పుడూ లేనట్టు 'తార్కిక విరుద్ధత' అనే కొత్త విధానంతో ఈ పేర్లన్నిటినీ తొలగించారు. చాలా ఆలస్యంగా వెల్లడికావటంవల్ల అనేకులు ట్రిబ్యునల్స్‌ను ఆశ్రయించలేకపోయారు. ఇలాంటివారు ఎన్ని లక్షలమందో తీరిగ్గా వెల్లడవుతుంది. అప్పటికల్లా పుణ్యకాలం కాస్తా ముగుస్తుంది! ఆంధ్రప్రదేశ్‌లో 2024లో యథేచ్ఛగా సాగిన ఎన్నికల వైపరీత్యాల గురించి వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకూ ఈసీ నుంచి ఉలుకూ పలుకూ లేదు. లోక్‌సభకూ, అసెంబ్లీకీ ఒకేసారి జరిగిన పోలింగ్‌లో నిమిషానికి నలుగురు ఓటేశారన్నా దానికి పట్టదు. కానీ తగుదునమ్మా అంటూ మొన్న బిహార్‌లో, ఇప్పుడు ఎన్నికలు జరిగిన, జరగబోతున్న రాష్ట్రాల్లో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా పేరుతో 'సర్' ప్రక్రియ మొదలెట్టింది. ఏపీ విషయంలో ఈ 'స్వచ్ఛ సంకల్పం' ఏ గంగలో కలిసినట్టు? తమిళనాట చాలా దశాబ్దాల తర్వాత డీఎంకే, అన్నా డీఎంకేలకు సినీ హీరో విజయ్ నెలకొల్పిన టీవీకే పార్టీ రూపంలో పెను సవాలు ఎదురైంది. ఇందువల్ల ఎవరి లెక్క తారుమారువుతుందన్నది చూడాల్సి ఉంది. ఆయన సభలకు భారీయెత్తున జనం రావటం గమనించదగింది. బెంగాల్‌లో రెండు దశాబ్దాలనాడు భూసేకరణ విధానంపై పోరాడి ఏకంగా లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వానికే ఎసరు తెచ్చిన నందిగ్రామ్ ఇప్పుడు కొత్త దోవ తొక్కటం గమనార్హం. ఆనాడు మొత్తం సమాజానికి జరిగిన అన్యాయంపై ఒక్కటై ప్రశ్నించిన నందిగ్రామ్ ఇవాళ ఏ దేవుడు గొప్ప -- రాముడా, జగన్నాథుడా అనే అంశం చుట్టూ తిరుగుతోంది. తొలి దశ పోలింగ్‌లో ఉన్న ఈ నియోజకవర్గంలో బీజేపీ రామనామాన్ని, టీఎంసీ తన ఆధ్వర్యంలో నిర్మాణమైన జగన్నాథ్ ఆలయాన్ని తెగ ప్రచారం చేశాయి. ఏదేమైనా పోలింగ్ ప్రశాంతంగా ముగియాలని అందరూ కోరుకుంటారు.

# మణిపూర్ చక్కబడేదెన్నడు?





మణిపూర్‌లో తీవ్ర హింసాత్మక ఘటనలు జరిగి మూడేళ్లు కావస్తున్నా అక్కడింకా పరిస్థితులు చక్కబడలేదని తాజా ఉదంతాలు నిరూపిస్తున్నాయి. 2023 మే నెలలో హింసకు దారితీసిన వదంతులే ఇప్పటికీ ఆ రాష్ట్రాన్ని శాసిస్తున్నాయి. బీరేన్ సింగ్ నాయ కత్వంలోని బీజేపీ ప్రభుత్వం పోయి రాష్ట్రపతి పాలన వచ్చింది. అది ఏడాది కొనసాగాక మొన్న ఫిబ్రవరిలో ఆ పార్టీకి చెందిన ఖేమ్‌చంద్ సింగ్ ఆధ్వర్యాన కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కానీ పరస్పర అపనమ్మకం, జాతి విద్వేషాలు ఆగిందిలేదు. వందలాదిమంది ఆయుధాలు ధరించి గుంపులుగా బయల్దేరి ఊళ్లమీద పడి నిర్విచక్షణగా హత్యాకాండకు, అత్యాచారాలకు పాల్పడటం, ప్రార్థనా స్థలాలు, ఆవాసాలు తగలబెట్టడం ఇప్పుడు లేక పోవచ్చుగానీ... అవతలి పక్షంపై ఆగ్రహావేశాలు తగ్గలేదు. తరచుగా నిరసన ప్రదర్శనలు జరగటం, రహదారులను స్తంభింపజేయటం ఆగలేదు. కేంద్ర బలగాల సంఖ్యను పెంచటం, నిరంతర పహారా వంటివి హింసాత్మక ఉదంతాలను గణనీయంగా కట్టడి చేశాయి. కానీ ఇప్పటికీ విద్వేషాన్ని రెచ్చగొట్టే సందేశాలూ, తప్పుడు సమాచారం వ్యాప్తిలోనే ఉన్నాయి. ఈ నెల మొదటివారంలో ఒక ఇంటిపై బాంబుపడి ఇద్దరు పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయిన ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఆ బాంబు కుకీలు నివసిస్తున్న ప్రాంతంనుంచి వచ్చిపడిందనీ, వారికి భద్రతా బలగాలు కొమ్ముకాస్తున్నా యనీ ప్రచారం వెల్లువెత్తడంతో జనం ఒక సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడి చేశారు. అటుగా వాహనంలో వెళ్తున్న అస్సాం రైఫిల్స్‌కు చెందిన అధికారిని గుంపు చుట్టుముట్టి దౌర్జన్యం చేసింది. ఆయనను హతమార్చేందుకు ప్రయత్నిస్తుండగా భద్రతా బలగాలు రక్షించగలిగాయి. మొన్న మంగళవారం ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ముఖ్య మంత్రిని ఆందోళనకారులు అడ్డుకున్నప్పుడు లాఠీచార్జి చేసినా, బాష్పవాయు గోళాలు ప్రయోగించినా ఫలితం లేకపోయింది. చివరకు హెలికాప్టర్ తెప్పించుకుని అక్కడినుంచి ఆయన బయటపడాల్సి వచ్చింది. అంతకుముందు ఒక మాజీ సైనికుడితో సహా ఇద్దరు నాగా జాతీయుల్ని మిలిటెంట్లు హతమార్చారు. మూడేళ్ల క్రితం మెయితీలకూ, కుకీలకూ మధ్య వైరం హింసకు దారితీయగా ఇప్పుడు మెయితీల గురి నాగాలపై కూడా పడింది. ఒక పద్ధతి ప్రకారం వదంతులు వ్యాప్తిచేయటం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించటం ఇంకా ఆగలేదు. అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏమంటే... ఆ వదంతుల్ని ఖండిస్తూ పోలీసులు ప్రకటనలు విడుదల చేస్తున్నారు. కానీ ఉద్రిక్తతల్ని ఆపటంలో అవి పెద్దగా ఉపయోగపడటం లేదు. గతంలో బీరేన్ సింగ్ ప్రభుత్వ హయాంలో మెయితీలకు చెందిన సాయుధ మిలిటెంట్ సంస్థ ఆరంబాయ్ టెంగోల్‌ను చూసీచూడనట్టు వదిలేశారు. కుకీల 'దురాక్రమణల్ని' అడ్డుకునే పేరిట ఏర్పడిన ఆ సంస్థ కుకీలకూ, నాగాలకూ మాత్రమే కాదు, వారిని ప్రశ్నించే మెయితీలకు సైతం పెద్ద బెడదగా పరిణమించింది. బెదిరించటం, దౌర్జన్యం చేయటం, బలవంతంగా వసూళ్లకు పాల్పడటం ఆ సంస్థకు నిత్యకృత్యమైంది. మూడేళ్లనాటి ఉదంతాలతో పోలిస్తే హింసాత్మక ఘటనలు తగ్గివుండొచ్చు. కానీ ఇప్పటికీ సమాజం చీలికలు, పేలికలుగా ఉంది. మెయితీలూ, కుకీలూ ఒకరి ప్రాంతంలోకి ఒకరు వెళ్లలేకపోతున్నారు. పనిచేయగలిగిన సత్తావుండి అది దొరుకుతుందన్న భరోసా ఉన్నచోటకు పోలేకపోవటం, పై చదువులకు అర్హతలున్నా ఊరు కదల్లేక పోవటంకన్నా మించిన హింస ఏం ఉంటుంది? పరిమిత వనరులు, ఉపాధి లేమి, భిన్న తెగలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవటంవంటి కారణాలవల్లే అసంతృప్తి అవధులు దాటుతోంది. యువతకు ఉపాధి కల్పన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం, వారికి మెరుగైన అవకాశాలు రావటానికి తగిన ప్రణాళికలు రూపకల్పన చేయటంవంటి ప్రయత్నాలు ఎక్కడా కనబడవు. కనుకనే మిలిటెంట్ సంస్థల ఆధిపత్యం సాగుతోంది. మౌలిక సమస్యల్ని పరిష్కరించలేని రాజకీయ నేతలు ఓట్లు రాబట్టుకోవటానికి మాత్రం ఆయా తెగల్ని శాసించగల మిలిటెంటు సంస్థలకు సహకరిస్తున్నారు. ఇది కొనసాగినంత కాలమూ మణిపూర్ నెత్తురోడుతూనే ఉంటుంది. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిస్తేనే ఆ రాష్ట్రం తెరిపిన పడుతుంది.

# సి.ఆర్.డి.ఏ, రెవెన్యూ శాఖలు అత్యంత సమన్వయంతో పనిచేయాలి



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24 : సి.ఆర్.డి.ఏ, రెవెన్యూ శాఖలు అత్యంత సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. సి.ఆర్.డి.ఏ, రెవెన్యూ శాఖల సమన్వయ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నగరాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణానికి చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ నేపథ్యంలో సి.ఆర్.డి.ఏ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. భూ సంబంధిత అంశాలకు చెందిన దస్త్రాలు సంబంధిత ప్రతిపాదనలు తహసిల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో జరగాలని అన్నారు. భూ సేకరణ అధికారులు భూ సేకరణకు అవసరమగు నోటిఫికేషన్లు, నోటీసులు జారీ చేయడంలో నిర్దిష్టమైన నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రజల నుండి వచ్చే అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో నిబంధనలను పక్కాగా పాటించాలని అన్నారు. జిల్లా నుండి పరిష్కరించవలసిన అంశాలపై స్పష్టమైన వివరాలు అందించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి రికార్డును డిజిటలైజేషన్ చేయాలని, ఈ ప్రక్రియలో భాగంగా శాటిలైట్ ఛాయాచిత్రాలను పొందుపరచాలని అన్నారు. డాక్యుమెంటరీ సపోర్టుగా ప్రతి అంశాన్ని విధిగా జత చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల వారీగా భూ పరిశీలనకు జాయింట్ టీంలను ఏర్పాటు చేయాలని చెప్పారు. సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ మాట్లాడుతూ 8,352.69 చదరపు కిలో మీటర్ల పరిధిలో సి.ఆర్.డి.ఏ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో సి.ఆర్.డి.ఏ చట్టం ప్రకారం భూ సేకరణ ప్రక్రియ ఇతర అంశాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూమి, బంజరు, ఇనాం, దేవాదాయ, నీటిపారుదల తదితర భూముల కేటగిరీ వారీగా కార్యాచరణ ప్రణాళికలు అవసరం అని వివరించారు. ఈ సమన్వయ సమావేశంలో గుంటూరు, పల్నాడు జాయింట్ కలెక్టర్ లు అశుతోష్ శ్రీవాస్తవ, సంజనా సింహా, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, తెనాలి ఇన్ ఛార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, సి.ఆర్.డి.ఏ భూ సేకరణ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతి ప్రతిపాదిత పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

### హెలిప్యాడ్‌ల పరిశీలన.. - అధికారులతో కలెక్టర్ సమీక్ష



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 24: భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం జిల్లాకు విచ్చేయనున్న పర్యటనకు యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. పర్యటనలో భాగంగా ఆయన ప్రయాణించే హెలికాప్టర్ల ల్యాండింగ్ కోసం డచ్‌బంగ్లా, పోలీసు క్వార్టర్స్ మైదానాల్లో ఉన్న హెలిప్యాడ్‌లను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి శుక్రవారం క్షుణ్ణంగా పరిశీలించారు. వీవీఐపీ భద్రతా నిబంధనల ప్రకారం ప్రధాన హెలిప్యాడ్‌కు అనుబంధంగా మరొకటి ఉండాలన్న నిబంధన మేరకు, డచ్‌బంగ్లా వద్ద ప్రస్తుతం ఉన్న దాని పక్కనే మరో కొత్త హెలిప్యాడ్‌ను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలీసు క్వార్టర్స్‌లోనూ అదనపు హెలిప్యాడ్ నిర్మాణానికి స్థలాన్ని ఖరారు చేస్తూ, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఉపరాష్ట్రపతి పర్యటనలో ఎక్కడా ఎటువంటి ప్రోటోకాల్ లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాల వద్ద భద్రత, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భద్రతా వలయం పకడ్బందీగా ఉండాలని, కాన్వాయ్ మార్గంలో ఎటువంటి ఆటంకాలు ఉండకూడదని అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ, రెవెన్యూ, పోలీస్, ఇతర ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

### వృద్ధ గౌతమి నదిలో త్రిశూల స్నానం

### శాస్త్రోక్తంగా పుష్పోత్సవం



ఐ. పోలవరం, (మహి న్యూస్ )ఏప్రిల్ 24: మురమళ్ల లో నిత్యకళ్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం తోవ పూర్తయ్యాయి. ఈనెల 20 వతేది న ప్రారంభమయిన ఉత్సవాలు 24 వ తేదీతో ముగిశాయి.వ శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాల జరిగాయి. ఆఖరు రోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం గవ్యాంతం , కళాన్యాసం, పూర్ణాహుతి, స్వామి వారి,అమ్మవార్ల అభిషేకం,త్రిశూల స్నానం వసంతోత్సవం, రథోత్సవం, పుష్పోత్సవం,



పవళింపు సేవ, తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ ఏర్పాట్లు ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మ కర్త మండలి సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నివాస గృహం లో త్రాచు పాము



ముమ్మడివరం,మహి న్యూస్, ఏప్రిల్ 24.: నివాస గృహంలో కి త్రాచు పాము చేరి హల్చల్ చేయటంతో ఆ ఇంటి యజమానులు భయభ్రాంతులకు గురయ్యారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని చింతలమెరక గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మట్టపర్తి రాంబాబు నివాస గృహంలోనికి త్రాచు పాము చేరి హల్చల్ చేయటంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. పాము ఇంటిలోకి చేరిన విషయం భీమనపల్లి గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అధించగా గణేష్ వర్మ సంఘటనా స్థలానికి చేరుకుని త్రాచు పాముకు త్రాగునీటిని అందించారు.అత్యంత చాక చక్యంగా పామును పట్టి డబ్బాలో బంధించారు. పాము ను సీసాలో పెట్టి బంధించడంతో రాంబాబు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ వర్మ మాట్లాడుతూ వేసవి వేడి ని తట్టుకోలేక పాములు చల్లదనం కోసం, త్రాగునీరు కోసం నివాస గృహాల్లోకి వస్తున్నాయని అన్నారు. పాము ను గుర్తించిన వెంటనే తనకు సమాచారం అందిస్తే దానిని బంధించి సురక్షిత ప్రాంతంలో వదిలి వేస్తానని పేర్కొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు -డి. టీ. ఓ




ముమ్మిడివరం, మహిన్యూస్, ఏప్రిల్ 24.: నిబంధనలు పాటించని ప్రైవేటు బస్సుల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు.ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద యానం నుండి హైదరాబాదు వెళుతున్న 18 బస్సులను తనిఖీ నిర్వహించారు. బస్సుల్లో అగ్ని మాప నిరోధక పరికరాలు ఉన్నాయా లేదా,అత్యవసర ద్వారాలు తదితర విషయాలను పరిశీలించారు.ప్రయాణికుల లగేజీలను పరిశీలించారు.నాలుగు ప్రైవేటు ట్రావెల్ బస్సులపై క్రమశిక్షణరాహిత్యా చర్యలు నిమిత్తం కేసులు నమోదు చేసి రూ.6 వేలు అపరాధ రుసుము విధించారు.అతివేగం,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే డ్రైవర్ కి జైలు శిక్ష తప్పదని డి.టి.ఓ హెచ్చరించారు. నిరంతరం ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు .నిబంధనలు పాటించని బస్సు యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

# వేసవి సెలవులు ఎంజాయ్ చేద్దాం

### విహార యాత్రలే విజ్ఞాన సోపానాలు

### చిన్నారులను విహార యాత్రలకు తీసుకొని వెళ్ళండి

### నేటి నుండి వేసవి సెలవులు



ముమ్మిడివరం, మహి న్యూస్, ఏప్రిల్ 24.: పిల్లలకు విహారయాత్రల (ట్రిప్) కు పంపడమంటే.. ఒకరకమైన విజ్ఞాన యాత్రలకే పంపించడమే! దానివల్ల పిల్లలు కొత్త విషయాలు, ఆయా ప్రదేశాల గురించిన వివరాలు ఆకళింపు చేసుకుంటారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవులు అంటే చాలామంది తల్లిదండ్రులకు ఒక చిన్న తలనొప్పి. పిల్లలు ఇంట్లోనే ఉంటే 'స్క్రీన్ టైమ్' పెరిగిపోతుందని టెన్షన్. హోమ్‌వర్క్, కోచింగ్ క్లాసులతో నింపేస్తే వాళ్లకు అన్యాయం చేసినట్లు అనిపిస్తుంది. ఈ సందిగ్ధతకు సులభమైన, ఆరోగ్యకరమైన పరిష్కారం ఒకటి ఉంది. అదే విహారయాత్ర. ఊరి చుట్టూ తిప్పడమే కాదు, జీవితాన్ని నేర్పించే అనుభవం ఇది. ఎలా ప్లాన్ చేసుకోవాలి? ఎక్కడికి వెళ్లాలి? భయాలు ఎలా దూరం చేయాలో తెలుసుకుందాం. పిల్లల్ని తీసుకుని ఎక్కడికైనా వెళ్లాలనే ఆలోచన ఉంది.. కానీ, "చిన్న పిల్లల్ని తీసుకెళ్లడం కష్టం", "చదువు డిస్టర్బ్ అవుతుంది", "ఖర్చు ఎక్కువ అవుతుంది" అనే సందేహాలు చాలామందికి ఉంటాయి.



నిజానికి సరైన ప్రణాళిక వేసుకుంటే విహారయాత్ర అనేది పిల్లలకు పాఠశాలలో నేర్చుకోలేని అనేక పాఠాలు నేర్పించే ఒక లివింగ్ క్లాస్‌రూమ్ వంటిది.

### ఎందుకు అవసరం:

పిల్లల మనస్తత్వ శాస్త్రవేత్తల ప్రకారం కొత్త ప్రదేశాలకు వెళ్లడం వల్ల పిల్లల్లోని క్యూరియాసిటీ (జిజ్ఞాస) పెరుగుతుంది. ఒక పుస్తకంలో చదివిన కొండ, సముద్రం, చరిత్రను కళ్లారా చూసినప్పుడు వాళ్లకు ఆ విషయం అర్థంకావడం చాలా సులభమవుతుంది. సహనం, అనుకూలత నేర్పుతుంది: బస్సు / రైలు ఆలస్యం అయినా, వాతావరణం మారినా, ఇష్టమైన ఫుడ్ దొరక్కపోయినా.. ఇలాంటి సమయాల్లో పిల్లలు అలాంటివాటిని ఎదుర్కోవడం నేర్చుకుంటారు. 'ప్లాన్ బి' ఎలా అమలు చేయాలో అర్థమవుతుంది. బంధం బలపడుతుంది: రోజూ ఆఫీసు, స్కూల్, ట్యూషన్ల మధ్య చిక్కుకుపోయిన కుటుంబసభ్యుల మధ్య సంభాషణలు తగ్గిపోతాయి. యాత్రలో రోజంతా కలిసి ఉండటం వల్ల తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య ఉన్న అంతరం తగ్గుతుంది. ఆటలు, నవ్వులు, కలిసి ఫోటోలు దిగడం వల్ల మధురమైన జ్ఞాపకాలు మిగులుతాయి. స్క్రీన్ నుంచి బయటికి: యాత్రలో ట్రెక్కింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ లాంటివి సహజంగానే వస్తాయి. ఫోన్, ట్యాబ్‌లకు దూరంగా నిజజీవితాన్ని ఆస్వాదించడం నేర్చుకుంటారు.

### ఎలా ప్లాన్ చేసుకోవాలి:

యాత్ర విజయవంతం కావాలంటే అది పిల్లలకు ఎంత ఆనందంగా ఉంటుందో, తల్లిదండ్రులకు అంత సౌకర్యంగా ఉండాలి. కాబట్టి ప్లానింగ్‌లో కొన్ని ముఖ్యమైన స్టెప్స్ ఫాలో అవ్వాలి.

### వయస్సును బట్టి గమ్యం (డెస్టినేషన్) ఎంచుకోవాలి..

చిన్నారులు (2–5 సంవత్సరాలు): ఎక్కువ దూరం ప్రయాణం చేయించకండి. దగ్గర్లో ఉండే హిల్ స్టేషన్లు, రిసార్ట్స్, జూ, బొటానికల్ గార్డెన్స్ వంటివి ఎంచుకోండి. ఎక్కువ సౌకర్యాలు (క్లీన్ టాయిలెట్, గుడ్‌ఫుడ్) ఉండే చోటుకు వెళ్లడం మంచిది. పెద్ద పిల్లలు (6–12 సంవత్సరాలు): వీరికి అడ్వెంచర్, చరిత్ర, సైన్స్ అంటే ఇష్టం. మ్యూజియంలు, ప్లానిటోరియంలు, బీచ్‌లు, కొండలు ఎక్కే ప్రదేశాలు, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు వీరికి చాలా నచ్చుతాయి. టీనేజర్లు (13): వీరికి స్వేచ్ఛ కావాలి. వారి అభిరుచిని అడిగి, ప్లాన్ చేయండి. ట్రెక్కింగ్, వాటర్ స్పోర్ట్స్, హెరిటేజ్ సిటీలు, రోడ్ ట్రిప్స్ వీరికి బాగా నచ్చుతాయి.

### పిల్లల్ని ప్లానింగ్‌లో భాగస్వాముల్ని చేయండి:

ఎక్కడికి వెళ్లాలి, ఏం తినాలి, ఏం చూడాలి అనే విషయాల్లో వారి అభిప్రాయాల్ని అడగండి. దీనివల్ల వారికి యాత్రపై ఓనర్‌షిప్ ఫీలింగ్ వస్తుంది. వారు ఎంచుకున్న స్థలం కాబట్టి, అక్కడ వారు ఎక్కువగా ఎంజాయ్ చేస్తారు. ఇది వారి నిర్ణయాత్మక సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది.

### హెల్త్ కిట్ మర్చిపోవద్దు:

పిల్లలతో ప్రయాణం అంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. జ్వరం, జలుబు, కడుపునొప్పి, గాయాలకు కావాల్సిన మందులు, బ్యాండ్-ఎయిడ్స్, కోల్డ్‌క్రీమ్, సన్ స్క్రీన్ లాంటివి ప్యాక్ చేసుకోవాలి. వాతావరణం మార్పు వల్ల అలర్జీలు రాకుండా చూసుకోవాలి.

### ప్రయాణంలో ఈ టిప్స్ పాటించాలి..

- స్క్రీన్ టైమ్ పరిమితం చేయండి: ప్రయాణంలో బోర్ కొట్టకుండా ఉండేందుకు చిన్న గేమ్స్ (ఐ స్పై, యాంటాక్షరి), కలరింగ్ బుక్స్, పజిల్స్ తీసుకెళ్లండి. ఫోన్ ఇచ్చేయడం వల్ల కుదురుగా ఉంటారు. కానీ, చుట్టుపక్కల వాతావరణాన్ని గమనించే అవకాశం దక్కదు. విశ్రాంతికి ప్రాధాన్యం: పిల్లలకు అలసట రాకుండా చూసుకోండి. రోజులో ఎక్కువ స్థలాలు కవర్ చేయాలనే తొందర వద్దు. ప్రతి రోజూ కనీసం 1–2 గంటలు హోటల్‌లోనే విశ్రాంతి తీసుకునేలా షెడ్యూల్ వేసుకోండి.

### ఫుడ్ విషయంలో కాంప్రమైజ్ వద్దు :

ఎక్కడికి వెళ్లినా, పిల్లలకు సురక్షితమైన నీళ్లు, తేలికైన హోమ్లీఫుడ్ ఉండేలా చూసుకోండి. పచ్చళ్లు, పప్పు, అన్నం లాంటివి దొరికే రెస్టారెంట్లనే ఎంచుకోండి. రోడ్డు మీద అనవసరమైన స్ట్రీట్‌ఫుడ్ మానుకోవడం మంచిది.

### తల్లిదండ్రులారా, గుర్తుంచుకోండి:

యాత్ర అంటే 'పరిపూర్ణంగా' ఉండాలనే ఒత్తిడి పెట్టుకోకండి. ఏదైనా తప్పు జరిగి, ప్లాన్ ప్రకారం జరగకపోతే చిరాకు పడకండి. కొన్నిసార్లు ఊహించని అనుభవాలే ఎక్కువసేపు గుర్తుండిపోతాయి. పిల్లల్ని విహారయాత్రకు తీసుకెళ్లడం అంటే వారికి ఒక బహుమతిని ఇచ్చినట్లే. ఆ బహుమతి డబ్బుతో కొన్న వస్తువు కాదు, అది జ్ఞాపకాల రూపంలో వారి జీవితాంతం నిలిచిపోయే అనుభవం. ఈ సెలవుల్లో మీ పిల్లల చేయి పట్టుకుని బయలుదేరండి. వారి కళ్లలో కనిపించే ఆశ్చర్యం, వారి నవ్వులో మారుమోగే సంతోషం.. అవే మీ యాత్రకు నిజమైన విజయం. సెలవులను నెలవులుగా మార్చండి! ప్రయాణాన్ని పాఠంగా మార్చండి!!

# ప్రాణాలను పణంగా పెట్టే అభివృద్ధి అవసరమా ?

### డా.ముచ్చుకోట సురేష్ బాబు, అధ్యక్షుడు,ప్రజాసైన్స్ వేదిక,

అనంతపురం మహీన్యూస్ ఏప్రిల్ 24: పర్యావరణ ప్రమాదాలు అగ్నిప్రమాదాలు లేని రోజు భారతదేశంలో లేదనిపిస్తుంది. హిందూస్తాన్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్ రిఫైనరీ, ?79,459 కోట్ల వ్యయంతో నిర్మితమైన హెచ్ పిసిఎల్ మరియు రాజస్థాన్ ప్రభుత్వ సంయుక్త ప్రాజెక్టు, 2026 ఏప్రిల్ 21న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేత ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, ప్రారంభానికి ఒక రోజు ముందు ఏప్రిల్ 20, 2026) మధ్యాహ్నం, రాజస్థాన్‌లోని బాల్టోరా జిల్లాలో ఉన్న రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ సముదాయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ యూనిట్ పరిమాణం ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన బిపిసిఎల్ యూనిట్‌కు సమానంగా ఉంది. ఈ ఘటన పర్యావరణ ప్రభావ అంచనా మరియు త్వరిత ప్రమాద అంచనా నివేదికల సమగ్రతపై తీవ్రమైన సందేహాలను రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ప్రమాద నివారణ చర్యలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ విషయంలో గణనీయమైన లోపాలు కనిపిస్తున్నాయి. సమీప ప్రాంతాల ప్రజల రక్షణకు అవసరమైన చర్యలు చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. సైంటిస్ట్ ఫర్ పీపుల్ స్వతంత్ర అంచనా ప్రకారం, ఫ్యూజిటివ్ ఎమిషన్స్ సంవత్సరానికి సుమారు 7,500 టన్నుల వరకు ఉంటాయి. అయితే, ఈఐఏ నివేదికలో ప్రాణాంతకమైన విష ఉద్గారాల స్వభావం, ప్రభావాలపై సరైన వివరణ లేదు. ఇది అత్యంత ఆందోళనకర విషయం.ఇలాంటి అధిక ప్రమాద పరిశ్రమల విషయంలో మార్గదర్శకంగా ఉండాల్సిన "జాగ్రత్త సూత్రం" పూర్తిగా నిర్లక్ష్యం చేయబడినట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో, ప్రతిపాదిత ప్లాంట్ సమీప గ్రామాలు, ప్రజల భద్రతను నిర్ధారించేందుకు సంబంధిత అధికారులు మరియు బాధ్యత గల వర్గాలు తక్షణ చర్యలు తీసుకోవడం అత్యవసరం. పెట్టుబడే ధ్యేయంగా ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే అభివృద్ధి అభిలషణీయమా. పదునెనిమిది వందల పేజీల ఆంగ్ల నివేదికలను ప్రజలకు అందుబాటులో లేకుండా వెబ్ లో పెట్టి వారికి కనీస సమాచారం అందించే బాధ్యత కూడా తీసుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎవరి కోసం పనిచేస్తున్నారు? మనది స్వతంత్ర భారతమా? కార్పొరేట్ భారతమా? ప్రజలకు జీవించే హక్కు ఉందా? లేదా? పర్యావరణ న్యాయం వారికి లభించేలా ప్రజాసంఘాలు, సైన్స్ ప్రచార సంస్థలు, విద్యావంతులు బలమైన ప్రయత్నం చేయాలి. ఏప్రిల్ 26 వరకూ అభిప్రాయాలూ, అభ్యంతరాలు పంపే అవకాశం వుంది. విజ్ఞాన వేదికలు, మేధావులు, హక్కుల సంఘాలు విధ్వంసకర అభివృద్ధిని ప్రశ్నించాలి.

### వేగం అభివృద్ధికి చిహ్నం కాదు - విపత్తుకు సంకేతం!




నెల్లూరు బీపీసీఎల్ రిఫైనరీ అనుమతులలో ప్రభుత్వ తొందరపాటుపై బహిరంగ హెచ్చరిక. ఇంజనీరింగ్‌లో ఒక పాత సామెత ఉంది: "రెండుసార్లు కొలిచి, ఒకసారి కోయాలి". అంటే, ఏదైనా పని చేసే ముందు తగినంత సమయం తీసుకుని లెక్కలు సరిచూసుకోవాలి. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మరియు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో అత్యంత ప్రమాదకరమైన బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టును సరైన పరిశీలన లేకుండానే వేగంగా ముందుకు వెడుతోంది. ఈ తొందరపాటు వల్ల మన ప్రాణాలకు, పర్యావరణానికి వాటిల్లే ముప్పు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి:

### 1. ఇది సాదాసీదా పరిశ్రమ కాదు - ఒక పెను ముప్పు!

ఈ రిఫైనరీ ఏటా 3,60,000 టన్నుల క్లోరిన్ గ్యాస్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంది. సైక్లోన్లు వచ్చే తీరప్రాంతంలో, భూకంప ముప్పు ఉన్న జోన్‌లో ఇలాంటి భారీ స్థాయి రసాయన నిల్వలు ఉండటం అంటే మనం ఒక 'బాంబు' మీద నివసించడమే. ప్రభుత్వం చూపుతున్న వేగం వల్ల ఈ రిస్కులను సరిగ్గా అంచనా వేయడం లేదు.

### 2. ఎల్జీ పాలిమర్స్ వంటి విపత్తుకు దారితీయవచ్చు :

బీపీసీఎల్ స్వయంగా ఇచ్చిన నివేదిక ప్రకారం , కేవలం 25 మి.మీ. క్లోరిన్ లీకేజీ జరిగితే ఆ విషవాయువు 4.8 కి.మీ. మేర విస్తరించి ప్రాణాపాయం కలిగిస్తుంది. సరైన అత్యవసర ప్రణాళికలు, గ్రామాలకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు లేకుండా ప్రాజెక్టును వేగంగా ప్రారంభించడం అంటే మరో 'ఎల్జీ పాలిమర్స్' వంటి దుర్ఘటనను ఆహ్వానించడమే. 3. నివేదికల్లోని డొల్లతనం - హాస్యాస్పదమైన సర్వేలు

### 992 పేజీల పర్యావరణ నివేదికలో 42 తీవ్రమైన లోపాలు ఉన్నాయి.

తాబేళ్ల సర్వే: తాబేళ్లు గుడ్లు పెట్టని కాలంలో (మార్చి నుండి మే) సర్వే చేసి, "ఇక్కడ తాబేళ్లు లేవు" అని తేల్చారు. ఇది ఎంతటి అశాస్త్రీయమైన పద్ధతో ఆలోచించండి.

వాతావరణం: విష వాయువులు నేల మీదకు దిగే శీతాకాల వాతావరణాన్ని అసలు పరిగణనలోకి తీసుకోలేదు.

ఆరోగ్యం: గ్రామంలో ప్రస్తుతం ఉన్న క్యాన్సర్ లేదా శ్వాసకోశ వ్యాధుల వివరాలను నమోదు చేయలేదు. రేపు రిఫైనరీ వల్ల జబ్బులు వచ్చినా, దానికి రిఫైనరీనే కారణమని నిరూపించడానికి ఆధారాలు లేకుండా చేస్తున్నారు.

### 4. రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం మనకు సురక్షితమైన వాతావరణంలో జీవించే హక్కు ఉంది. గ్రామ సభలు నిర్వహించకుండా, ప్రజల నుంచి వాస్తవమైన అంగీకారం తీసుకోకుండా భూసేకరణ చేయడం చట్టవిరుద్ధం.

నాలుగు గ్రామాలను తరలిస్తున్నా, వారికి సంబంధించి ఎటువంటి పునరావాస ప్రణాళిక నివేదికలో లేదు.

### 5. తప్పుల తడకగా ప్లాంట్ డిజైన్

తొందరపాటు వల్ల రిఫైనరీ లేఅవుట్‌లోనే ప్రమాదకర లోపాలు ఉన్నాయి. ముఖ్యమైన కంట్రోల్ రూమ్ మరియు ఫైర్ వాటర్ పంప్ హౌస్ లు ప్రమాదకర జోన్లలోనే ఉన్నాయని బీపీసీఎల్ స్వంత నివేదికే చెబుతోంది. వీటిని ఇప్పుడే సరిచేయకపోతే, రేపు ప్రమాదం జరిగినప్పుడు ప్రాణనష్టాన్ని ఎవరూ ఆపలేరు. అభివృద్ధి మనకు అవసరమే, కానీ అది మన ప్రాణాలను పణంగా పెట్టి రాకూడదు. ఒక ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలించడానికి 30 నెలలు పడుతుంది, కానీ దానిని కేవలం 16 నెలల్లోనే పూర్తి చేయాలని చూడటం వినాశనానికి దారితీస్తుంది. ఇది అస్తమిస్తున్న పరిశ్రమ. ఈ శతాబ్దంలోనే మూత బడక తప్పని పరిశ్రమ. పర్యావరణ అనుమతులు ఇచ్చే ముందు పూర్తిస్థాయి శాస్త్రీయ విచారణ జరగాలి. ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి. వేగం కంటే ప్రాణాల భద్రతే ముఖ్యం.

# ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు

ముమ్మిడివరం, మహి న్యూస్, ఏప్రిల్ 24.: గ్రామాలలో ప్రగతి పాలనకు గ్రామ పంచాయతీలే మూలస్థంభాలని ముమ్మిడివరం మండల అభివృద్ధి అధికారి మరియు ప్రత్యేక అధికారి



జె.ఎల్.ఎన్ దీక్షితులు పేర్కొన్నారు. మండలంలోని సి.హెచ్.గున్నే పల్లి పంచాయతీ కార్యాలయం నందు జాతీయ పంచాయతీ రాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పంచాయతీ కార్యదర్శి కె. ఇందుమతి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సభకు ఎంపిడిఒ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి దీక్షితులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1994 లో పంచాయతీ రాజ్ చట్టం అమలులోకి వచ్చిందని, అప్పటి నుండి గ్రామీణ స్థాయిలో ప్రగతి పాలనకు నాంది పడిందన్నారు. మూడు అంచెల విధానంలో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ లు మరియు జిల్లా పరిషత్ లు గ్రామ సభల ద్వారా ప్రజలకు ప్రగతి పాలన అందించడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుందన్నారు.అలాగే అనాతవరం, అయినాపురం గ్రామ పంచాయతీ లలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు సురేష్(అనాతవరం), వెంకటేష్(అయినా పురం) సచివాలయం సిబ్బందితో పాటు ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహి న్యూస్
తెలుగు దినపత్రిక
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
శనివారం - 25 - ఏప్రిల్ - 2026

# ఏప్రిల్ 26న చలో తిరుపతి - సీపీఐ



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్, ఏప్రిల్ 24) : ఏప్రిల్ 26న తిరుపతిలో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభల సందర్భంగా భారీ బహిరంగ సభకు ఉద్యోగ కార్మిక వర్గాలు వేలాదిగా తరలి రావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభల కరపత్రాలను పట్టణ సమితి ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ, ఏప్రిల్ 26,27,28,29 తేదీలలో తిరుపతిలో జరుగనున్న రాష్ట్ర 18వ మహాసభలకు 15వేల మంది రాష్ట్ర వ్యాప్తంగా గల ప్రభుత్వ ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులు హాజరు కానున్నారని తెలిపారు. కేంద్రంలో మోదీ సర్కార్ ఉద్యోగ కార్మికుల సంక్షేమాన్ని గాలి కొదిలేసి విదేశీ స్వదేశీ బహుళ జాతి సంస్థలకు అనుగుణంగా కార్మిక చట్టాలను మార్పు చేశారన్నారు. కారుచౌకగా కార్మికులను ఈ కంపెనీలకు కట్టు బానిసలుగా మార్చేస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్ లోనూ ఉద్యోగ కార్మికులను విస్మరించారన్నారు. రాష్ట్రంలోనూ డబల్ ఇంజన్ సర్కార్ మోదీ విధానాలను అవలంబిస్తూ రెండేళ్ల గడిచిన 12వ పీఆర్సీ ప్రకటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులను కేటాయించకుండా మిట్టల్ కు మాత్రం ప్రైవేటు రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వేల కోట్ల రూపాయలు రాయితీ లిస్తున్నారన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే లేని ఎంపీలు డీలిమిటేషన్ కు మాత్రం బీజేపీ కి మద్దతియడం వెనుక సొంత గద్దెపై వీరికున్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమౌతున్నదన్నారు. ఈ దశలో కనీస వేతనాల పెంపుకు, ధరల నియంత్రణకై జిల్లాలో చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకై తిరుపతిలో జరగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఆందోళనలకు ఉద్యమ కార్యాచరణలను తీసుకుంటామన్నారు. కనుక సంఘటిత అసంఘటిత రంగ కార్మికవర్గం 26 వ తేదీ జరుగు భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్, జాతీయ కార్యదర్శి ఆదినారాయణ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, శీలం వెంకటసుబ్బయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి తదితరులు హాజరుకానున్నారన్నారు. ఈ కరపత్రాల ఆవిష్కరణలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు హరి చైతన్య, ఉపాధ్యక్షులు వసంతరావు, సమితి సభ్యులు సురేష్, స్వర్ణలతలు హాజరయ్యారు.

# ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి దిశానిర్దేశం..!

## సిబ్బందికి సమగ్ర శిక్షణ కార్యక్రమం



కడప,మహి న్యూస్ ఏప్రిల్ 24 : కడప సింధూర్ ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా పంటలకు హాని కలిగించే పురుగులు, తెగుళ్లు మరియు వాటి నివారణ చర్యలపై వివరంగా చర్చించారు. మిత్ర పురుగుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రకృతి వ్యవసాయంలో వాటి పాత్రను వివరించారు. అదనంగా జీవామృతం, ఘనజీవామృతం, వివిధ కషాయాల తయారీ విధానం, వినియోగం మరియు వాటి ప్రయోజనాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ద్వారా సిబ్బంది నేర్చుకున్న విషయాలను గ్రామస్థాయిలో రైతులకు చేరవేయాలని సూచించారు. అలాగే క్యాడర్ సభ్యుల సొంత పొలాల స్థితిగతులను పరిశీలిస్తూ, వారి ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.




భూమిని 365 రోజులు పచ్చదనంతో కప్పి ఉంచే విధానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి ఆరోగ్యం, స్థిరమైన ఆదాయం మరియు మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. కొత్తగా ఎంపికైన కార్యకర్తలు ఈ శిక్షణను సమగ్రంగా గ్రహించి, స్వయంగా ప్రకృతి వ్యవసాయం ఆచరిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని, గ్రామాల్లో మోడల్ ఫార్మ్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బంది నైపుణ్యాలు మెరుగుపడి, జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తరణకు దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వ్యవస్థ బలోపేతానికి సహకరించాలి

## గ్రామస్థాయి పాలన ప్రజల చేతుల్లోకి రావాలి

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 24: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ నూతన సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సీఈవో ఆర్.వెంట్రామన్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన దేశభక్తి గీతంతో సభను ప్రారంభించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎం. ఎస్. ఎం .ఈ. సెర్ప్ ఎన్నారై ఎంపర్ మెంట్ అండ్ రిలేషన్స్ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామీణాభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎంతో కీలకమని, తనకు ఇష్టమైన శాఖలలో పంచాయతీరాజ్ శాఖ ఒకటని ప్రజలతో మమేకమై వారికి సేవచేసే భాగ్యం ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులమైన మాకు మరియు శాఖా పరంగా అన్ని సంక్షేమ పథకాలను సకాలంలో అందించే బాధ్యతలు నిర్వర్తించే ఈ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులదని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు ప్రతి విషయంలోనూ కొత్తదనం, నూతన ఆలోచనలతో ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు పదోన్నతులు లేక ఇబ్బందులు పడ్డారని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీరాజ్ శాఖ మంత్రి మరియు డిప్యూటీ సీ.ఎం . కె. పవన్ కళ్యాణ్ గారు పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించుటలో కృషి చేశారని మరియు తెలుగుదేశం ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ప్రతీ విషయంలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది తెలిపారు. గ్రామస్థాయి పాలనను ప్రజల చేతుల్లోకి తీసుకువచ్చి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో పంచాయతీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, శుభ్రత, తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో పంచాయతీ సంస్థలు చేస్తున్న సేవలను గుర్తు చేశారు. ప్రజలందరూ పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి సహకరించాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామ సభలలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరచాలని ఆయన కోరారు. తదుపరి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా సంక్షేమ ప్రభుత్వమని స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేస్తుందని, సంస్కరణల ద్వారా వ్యవస్థలను పటిష్ట పరిచే దిశగా తెలుగుదేశం ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. జిల్లా పరిషత్ సి. ఈ .ఓ, ఆర్ .వెంకట్రామన్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజలతో మమేకమై వారి అభివృద్ధి కొరకు వివిధ పథకాలను ప్రజల చెంతకు చేర్చే బాధ్యత గల ఈ పంచాయతీరాజ్ శాఖలో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ప్రాముఖ్యతను వివరిస్తూ 73వ రాజ్యాంగ సవరణ దాని ప్రాముఖ్యత గురించి ఉద్యోగులకు వివరించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామీణాభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎంతో కీలకమని, స్థానిక స్వపరిపాలనకు ఇది బలమైన పునాది అని అధికారులకు తెలిపారు. అనంతరం విధి నిర్వహణలో విశేష సేవలందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు మరియు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ , పి.డి .కిరణ్ కుమార్, శ్రీకాకుళం, టెక్కలి, పలాస డి.డి.ఓలు, ఎం.డి.ఓలు, ఎం.పీ.డీ.వోలు, డిప్యూటీ ఎం.పీ.డీ.వోలు, సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 25న ప్రపంచ మలేరియా దినోత్సవం

గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24 : ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఏప్రిల్ 25న నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మలేరియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, నివారణ చర్యలను బలోపేతం చేయడం ముఖ్య లక్ష్యంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సంవత్సరం "మలేరియా రహిత సమాజం కోసం కలిసికట్టుగా ముందుకు" అనే నినాదంతో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మలేరియా అనేది దోమల ద్వారా వ్యాపించే వ్యాధి అని, ఆడ అనోఫిలీస్ దోమ కాటు వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. జ్వరం, వణుకు, చెమట, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. మలేరియాను నివారించడానికి ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల పెరుగుదల లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమతెరలు, రిపెలెంట్లు వినియోగించాలని, పూర్తిగా చేతులు, కాళ్లు కప్పుకునే దుస్తులు ధరించాలని, జ్వరం వచ్చిన వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం మలేరియా నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో దోమల నివారణ చర్యలు, ఫాగింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మలేరియా పూర్తిగా నివారించగలిగే వ్యాధి అని, ప్రజల భాగస్వామ్యం, పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు.

# పక్కా ప్రణాళికలతో జి.ఎస్.టి లక్ష్యాలు సాధించాలి

గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24 : రాష్ట్ర జి.ఎస్.టి లక్ష్యాలను సాధించుటకు పక్కా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. రాష్ట్ర జి.ఎస్.టి వసూళ్ల పెంపుపై వివిధ శాఖలతో సమన్వయ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ప్రభుత్వ పనులు పూర్తి చేసిన అనంతరం బిల్లులు అప్ లోడ్ చేసే సమయంలో జి.ఎస్.టి వివరాలపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. రాష్ట్ర జి.ఎస్.టి జాయింట్ కమిషనర్ గీతా మాధురి మాట్లాడుతూ గుంటూరు ఒకటవ డివిజన్ పరిధిలో ఆరు సర్కిల్ లు ఉన్నాయన్నారు. ఎస్.జి.ఎస్.టి లక్ష్యం రూ.134.33 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.109.43 కోట్లను సాధించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పనులు చేస్తున్న గుత్తేదారుల నుండి చెల్లింపులు సక్రమంగా జరగడం లేదని, ప్రభుత్వ పనులు జరుగుతున్న వివరాలు అందించాలని కోరారు. విద్యా శాఖ అధికారులు వివిధ ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు సమర్పించడం వలన పన్నుల వసూళ్లకు అవకాశం ఉంటుందన్నారు. రూ.15 వేలు కంటే ఎక్కువ వేతనం పొందుతున్న వారి నుండి వృత్తి పన్ను వసూలు చేయుటకు అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. కృష్ణ, ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస్, ఎం.టి.ఎం.సి అదనపు కమిషనర్ శకుంతల, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పల నాయుడు, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, జి.ఎస్.టి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బండి మహాలక్ష్మి"కు సన్మానం



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం (మహిన్యూస్ ఏప్రిల్ 24): పి.గన్నవరం మండలం, బెల్లంపూడి గ్రామ సర్పంచ్ గా 5 సంవత్సరాలు పాటు పనిచేసి,బెల్లంపూడి గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేసి,ప్రజలకు విశేషసేవలు అందించి,ఇటీవల కాలంలో ( ఏప్రిల్ 2వ తేదీన)పదవీ విరమణ చేసిన "బండి మహాలక్ష్మి " ని ఈరోజు పి.గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ , ఎంపీపీ గనిశెట్టి నాగ లక్ష్మీ , ఎంపీడీవో మల్లిఖార్జున రావు ,తదితరులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు శ్రీమతి బండి మహాలక్ష్మి సర్పంచ్ గా అయిదేళ్ల పాటు బెల్లంపూడి గ్రామంలో చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేశారని,ప్రజలకు ఆమె అందించిన సేవలు ప్రశంసనీయమని , గ్రామంలో రోడ్ల నిర్మాణం,ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా ఉదయం,సాయంత్రం స్వచ్ఛమైన త్రాగునీటి సరఫరా చేయడం, వీధి దీపాలు నిర్వహణ ,ఇంటింటి నుండి ప్రతి రోజు చెత్త సేకరణ చేయించి,గ్రామాన్ని అత్యంత పరిశుభ్రంగా ఉండేటట్లు కృషి చేశారని,గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేశారని కొనియాడారు.ప్రజలకు అందుబాటులో ఉండి,ఆమె ప్రజలకు అందించిన సేవలు ప్రశంసనీయమని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొని "బండి మహాలక్ష్మి"ని సత్కరించి, అభినందనలు తెలిపారు.

# గ్రామ స్వరాజ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ఒంగోలు, మహి న్యూస్, ఏప్రిల్ 24 : పంచాయతీ రాజ్ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పనిచేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు, బి ఎన్ విజయకుమార్లతో కలసి పాల్గొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, మహాత్మాగాంధీ గారు పల్లె సీమలు అభివృద్ధి చెందాలి, గ్రామా స్వరాజం రావాలని నినాదం తీసుకురాగా, డా. బిఆర్ అంబేద్కర్ గ్రామసీమలు ప్రత్యేకంగా అభివృద్ధి చెందాలని రాజ్యాంగంలో పొందపర్చడం జరిగిదన్నారు. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థకు చట్టబద్ధత తీసుకురాగా, ఆనాటి నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాలు ప్రగతి పథంలో నడిచినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, నిధుల వినియోగం లాంటి అంశాలను సమన్వయం చేయడం కోసమే పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు అయినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి కి ప్రత్యేక శ్రద్ద తీసుకోవడంతో పాటు పంచాయతీ వ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. స్వర్ణ గ్రామంలో ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో పాటు వారి పర్యవేక్షణకు మండల, జిల్లా స్థాయి అధికారులను కూడా నియమించి పూర్తి స్థాయిలో అభివృద్ధి సంక్షేమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. గుండమాల పంచాయతీకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల సంబంధిత పంచాయతీ కార్యదర్శి లావణ్య ను ప్రత్యేకంగా మంత్రి అభినందించారు. గ్రామీణ స్థాయిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు పూర్తిస్థాయిలో అర్హులైన గ్రామీణ ప్రజలకు అందేలా పంచాయత్ వ్యవస్థ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామాల అభివృద్దికి పట్టుకొమ్మలన్నారు. ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థ రావడంతో మహాత్మాగాంధీ కలలు కన్న




గ్రామస్వరాజ్యం స్థాపనకు నాంది పలికిందన్నారు. కేంద్రం నుండి గ్రామం వరకు నిధుల కేటాయింపు అయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తూ వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. గుండమాల పంచాయత్ కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం మనందరికీ గర్వకారణమని, ఈ సందర్భంగా అవార్డుకు కృషిచేసిన పంచాయతీ సెక్రెటరీ ని అభినందిస్తూ వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించడం అభినందిస్తూ, ఈ పల్లె నిద్ర కార్యక్రమం గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎంతో దోహదపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్ స్థాపనను నిజం చేయడానికి పంచాయతీ రాజ్ వ్యవస్థను తీసుకురావడం జరిగిందని, గ్రామ స్వరాజ్ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం ఇతోధికంగా అభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ రాజ్ వ్యవస్థకు అత్యంత ప్రాధ్యానత ఇస్తున్నట్లు తెలిపారు. పరిపాలనను గ్రామీణ ప్రజలకు మరింత చేరువ చేయడానికి నేడు ఈ గవర్నెన్స్, వాట్సప్ గవర్నెన్స్ ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. స్వచ్ఛత అనేది ఆత్మగౌరవానికి నిదర్శం అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గ్రామ స్థాయిలో పటిష్టంగా అమలు కావడంతో పాటు వాటి ఫలాలు సంపూర్ణంగా గ్రామీణ ప్రజలకు అందేలా పంచాయతీ రాజ్ వ్యవస్థ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లావణ్య కృషితో నేడు జాతీయ స్థాయిలో గుండమాల పంచాయతీకి అవార్డు రావడం జరిగింది, అవార్డు రావడానికి చేసిన కృషిని డాక్యుమెంటేషన్ చేసి దాని అన్నీ గ్రామా పంచాయతీలకు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పటిష్టంగా పనిచేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగలో 73వ సవరణ ద్వారా 1992 ఏప్రిల్ 24న పంచాయతీ రాజ్ వ్యవస్థ ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఏ పంచాయతీకి ఆ పంచాయతీ అభివృద్ధి జరగాలన్న ఉద్దేశ్యం తో పంచాయతీ రాజ్ వ్యవస్థ ను తీసుకు వచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వసతి, విద్య, వైద్య సదుపాయాలు, రోడ్లు , గృహ నిర్మాణాలు తదితర మౌలిక సదుపాయాల కల్పన పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారానే అమలు జరుగుచున్నవన్నారు. కొత్తపట్నం మండలం, గుండమాల పంచాయతీకి జాతీయ స్థాయిలో అవార్డు రావడం ఎంతో సంతోషకరమన్నారు. జాతీయ స్థాయిలో అవార్డు రావడానికి కృషి చేసిన పంచాయతీ సెక్రటరీ లావణ్యను ప్రత్యేకంగా అభినందిస్తూ, వీరిని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. ఆనాడు జన్మభూమి కార్యక్రమం ద్వారా సిమెంటు రోడ్లు నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. నేడు ప్రతి పంచాయతీ లో 7 నుండి 8 మంది అధికారులు పనిచేస్తున్నారు. అలాగే పెద్ద మొత్తం లో నిధులు కూడా కేటాయించడం జరుగుచున్నదని, ప్రజల భాగస్వామ్యం తో గ్రామాల అభివృద్ధికి పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది కృషి చేయాలన్నారు. సంతనూతలపాడు శాసన సభ్యులు బి ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ, పరిపాలనలో పంచాయతీ వ్యవస్థ చాలా ప్రాధాన్యత కలిగివున్నదన్నారు. గ్రామస్థాయిలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా అమలు జరుగుచున్నవన్నారు. ఏ కార్యక్రమం విజయవంతంగా అమలు కావాలన్నా ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. గ్రామీణ ప్రజల మౌలిక వసతుల కల్పనలో పంచాయతీ రాజ్ వ్యవస్థ కీలకమని, పంచాయతీ రాజ వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కనిగిరి శాసన సభ్యులు డా ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది ఆనాటి గాంధీజీ ఆలోచనను నిజంచేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి గ్రామాల బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. భారత దేశ పౌరుడుగా గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్య కావాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి పంచాయతీ రాజ వ్యవస్థ లో విశేష కృషి చేసిన సిబ్బందికి మెరిట్ సర్టిఫికేట్స్ అందచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వర రావు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఈ నాగేశ్వర రావు, మెప్మా పిడి శ్రీమతి విజయలక్ష్మి, జిల్లాలోని డిఎల్డిఓ లు, ఎంపిడిఓలు, పంచాయతీ వ్యవస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాప్ లీగ్స్ బాక్సింగ్ టోర్నమెంట్ విజయవంతం




ప్రకాశం జిల్లా, మహి న్యూస్, ఏప్రిల్ 24 : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "శాప్ లీగ్స్ బాక్సింగ్ టోర్నమెంట్" డాక్టర్ పి. ఆనంద్ మినీ స్టేడియం నందు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం జిల్లా క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శ్రీమతి జి. రాజరాజేశ్వరి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ ఎస్. సురేష్, ఫుట్‌బాల్ కోచ్ శ్రీ పాల్ కుమార్, సపక్ తగడ శిక్షకుడు శ్రీ బి. శ్రీనివాసులు, బాక్సింగ్ శిక్షకులు శ్రీ పాణ్యం వేణు, కుమారి కె. కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, యువత క్రీడల వైపు మరింత ఆసక్తి చూపాలని, క్రమశిక్షణతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావడం ఆనందదాయకమని, వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లా పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ టోర్నమెంట్‌లో అండర్-15 మరియు అండర్-19 బాల, బాలికల విభాగాల్లో అనేక మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ నెల 28వ తేదీ నుండి 30వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించబడనున్న శాప్ లీగ్స్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి రెండు విభాగాల్లో మొత్తం 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కార్యక్రమం ముగింపులో విజేతలకు అభినందనలు తెలియజేసి, రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కోచ్‌లు, నిర్వాహకులు మరియు క్రీడాకారుల పాత్ర ప్రశంసనీయమని నిర్వాహకులు తెలిపారు.

# పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపితానికి చర్యలు




గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24 : రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపితానికి చర్యలు చేపట్టడం జరుగుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ సంచాలకులు ఎం. కృష్ణ తేజ అన్నారు. జిల్లా పరిషత్ లో శుక్రవారం నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంలో కృష్ణ తేజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామీణ అభివృద్ధికి మూల స్థంభం అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కావడం అవసరమని అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించి ప్రోత్సహించడం జరిగిందని తద్వారా ఉత్సాహంతో పనిచేయగలరని పేర్కొన్నారు. పంచాయతీలు కేవలం పథకాల అమలు వరకే పరిమితం కాకుండా స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు అధికారాలు సమకూర్చి ప్రతి గ్రామం అభివృద్ధి చెందే దిశగా కృషి చేస్తుందని చెప్పారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ, మ్యాజిక్ డ్రైన్ లు, పల్లె పండుగ, అడవితల్లి పథకం వంటి పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. రహదారులు, కాలువలు, పారిశుధ్యం తదితర కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఏ పథకం ప్రవేశపెట్టిన విజయం అవుతుందని, స్వర్ణ పంచాయతీ పథకం ద్వారా పన్ను వసూలు చేయడంలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని చెప్పారు. సోషల్ ఆడిట్ లు సైతం దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వ్యక్తులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టిన, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్.కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ నీటి భద్రతా ప్రణాళికలు రూపొందించుకోవాలి




వట్టిచెరుకూరు/గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24 : గ్రామ నీటి భద్రతా ప్రణాళికలు రూపొందించుకోవాలని మాస్టర్ ట్రైనర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.బ్రహ్మయ్య అన్నారు. జలధార -- జలహారతి" కార్యక్రమములో భాగంగా వట్టిచెరుకూరు మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణ గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లకు, ఉపాధి హామీ సిబ్బందికి శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అన్ని చిన్న నీటిమడుగుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల మరమ్మత్తులు, నీటి వనరుల అనుసంధానం, వరద నీటి వినియోగం మట్టి మరియు నీటి సంరక్షణ పనులు, రిడ్జ్ టు వ్యాలీ పద్ధతి అమలు, పచ్చదనం పెంపు, కొత్త నీటి నిల్వ నిర్మాణాలు, టెక్నాలజీ వినియోగం, చెరువుల ఫీడర్ ఛానల్స్ శుభ్రపరచడం, గట్లను బలోపేతం చేయడం, చెరువులను సమీపంలోని



కాలువలు లేదా వాగులతో అనుసంధానించడం, మొక్కల పెంపకం, కొత్త నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటు, గ్రామ నీటి బడ్జెట్ తయారీ తదితర అంశాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. వీటి పర్యవేక్షణకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. భూగర్భ జలాల 3 నుండి 6 మీటర్ల మధ్య నీటి మట్టం పెరుగుదల లక్ష్యంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. 15 మీటర్ల కంటే లోతైన ప్రాంతాలు ప్రాధాన్యతగా గుర్తించాలని, కనీసం 1 మీటర్ మెరుగుదల సాధించాలని తెలిపారు. శాటిలైట్ చిత్రాల ద్వారా శాస్త్రీయంగా చెరువుల మ్యాపింగ్ చేయడం, హైడ్రోలాజికల్ విశ్లేషణ ద్వారా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించడం, ఉపాధి హామీ పథకం నిధులతో పనుల అమలు, నిరంతర పర్యవేక్షణ, భూగర్భ జల మట్టాల విశ్లేషణ వంటి దశలను పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ మరియు భూగర్భ జలాల పునరుద్ధరణ కోసం చేపట్టిన 100 రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపట్టి గ్రామ నీటి భద్రతా ప్రణాళికలు, సాగు నీటి సంఘాల పాత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎం.పి.డి.ఓ శివపార్వతి, మాస్టర్ ట్రైనర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ వి ఎస్. ప్రసాద్, జలవనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు డి. జాన్ బాబు, ఎస్. సుబ్బరామి రెడ్డి, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, ఉపాధి హామీ ఏ.పి.ఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

# పి. మల్లవరం పంచాయతీ లో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం



తాళ్లరేవు, మహి న్యూస్, ఏప్రిల్ 24. : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి. మల్లవరం పంచాయతీ లో ప్రత్యేక అధికారి సి. హెచ్ యన్ యం ప్రకాష్ అధ్యక్షతన జరిగింది, ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మెన్ దున్నా జనార్ధనరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ లును బలోపేతం చేసిన రోజునే జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం కి సార్ధకత ఏర్పడుతుంది అన్నారు, తాళ్ళరేవు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ గ్రామ పంచాయతీ లు చేసే పనులు అన్నీ ప్రజలుతో కలిసి నిర్ణయంలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కు అవసరమైన చర్యలు తీసుకోవాలి అని కోరారు, ఈ కార్యక్రమం లో కార్యదర్శి సూరంపూడి వెంకటమణ, సచివాలయం కార్యదర్శి కర్రి రాజు, ముమ్మిడివరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీమతి పెచ్చెట్టి శ్రీలక్ష్మి శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు ధూళిపూడి గోవిందరావు, మొగళతుర్తి శ్రీనివాసరావు మరియు వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో దొంగతనాలపై ప్రత్యేక నిఘా

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఇన్స్పెక్టర్ - కత్తి శ్రీనివాసులు.



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం ఏప్రిల్ 24.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలంలోని ప్రజలు వేసవి సెలవుల సమయంలో అనేక కుటుంబాలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు , బంధువుల ఇండ్లకు వెళ్లే నేపథ్యంలో, ఖాళీగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కాబట్టి ప్రజలు జాగ్రత గా ఉండాలని బంగారుపాళ్యం మండల ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు శుక్రవారం పత్రికాముఖంగా తెలిపారు. ముఖ్యంగా తమిళనాడు రాష్ట్ర సరిహద్దు గ్రామాలలో జాగ్రత్తగా ఉండాలని పొరుగు రాష్ట్ర దొంగలు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు.ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న కొన్ని దొంగతన ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే దొంగతనాలను పూర్తిగా నివారించవచ్చని ఆయన సూచించారు. ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా సూచనలు:ఇళ్లలో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులు ఉంచకుండా, బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి. ఊరికి వెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించినట్లయితే , మీ ఇంటి వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడుతుంది.మీ ప్రయాణ వివరాలను నమ్మకమైన పొరుగువారికి లేదా బంధువులకు తెలియజేయండి.ఇంటి తలుపులు, కిటికీలు సరిగా లాక్ చేశారో లేదో నిర్ధారించుకోండి. అవసరమైతే ఆటోమేటిక్ లాకింగ్ సిస్టమ్ లేదా అలారం వ్యవస్థలను ఉపయోగించండి. బంగారు దుకాణాలు, ఇండ్ల దగ్గర హై-క్వాలిటీ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలి. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇంటి బయట నిద్రించే వారు ఆభరణాలు ధరించకుండా ఉండటం మంచిది.ఏదైనా అనుమానం లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్ 112 కు కాల్ చేయండి.ప్రజల సహకారం లేకుండా నేరాల నియంత్రణ సాధ్యం కాదు. మీ అప్రమత్తతే మీ ఆస్తికి రక్షణ." అని సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

# కూటమి పాలనలో బిజెపి మండల అధ్యక్షునికి విలువ లేదా

## పూతలపట్టు నియోజకవర్గం బిజెపి మండల అధ్యక్షులు ప్రసాద్.




చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం లో బిజెపి మండల అధ్యక్షుడు ప్రసాద్ మీడియాతో శుక్రవారం మాట్లాడుతూ, పూతలపట్టు మండలంలో జరుగుతున్నటువంటి పలు కార్యక్రమాలకు బిజెపి మండల అధ్యక్షుడు ప్రసాద్ అను నన్ను దళిత కులానికి చెందిన వాడనని ఎలాంటి కార్యక్రమాలకు ఆహ్వానం లేకుండా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్నటువంటి కార్యక్రమాలలో ఎలాంటి కార్యక్రమాలకి ఆహ్వానం లేకుండా చేస్తున్నారు. దీనికి కారణం నేను దళితుడు అయినందున ఆహ్వానం అందడం లేదు.ఆకనంబట్టు లో జరిగినటువంటి పీఎం సూర్య ఘర్ కార్యక్రమానికి సైతం నాకు ఆహ్వానం అందలేదు.పూతలపట్టు శాసన సభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ కూడా దళితుడే కదా? అగ్రకులాల వారు కూడా నాపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీనిపై నేను అధిష్టానానికి తెలియజేయాలని మీడియా ముఖంగా తెలియజేస్తున్నాను. దీనిపై అధిష్టానం కూడా నాకు జరిగిన అన్యాయానికి తీవ్రంగా ఖండించాలని తెలియజేస్తున్నట్లు ప్రసాద్ వెల్లడించారు.

# శ్రీవారికి బంగారు పతకాలు విరాళం





తిరుమల, మహి న్యూస్,ఏప్రిల్ 24 : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం బెంగుళూరుకు చెందిన డాక్టర్ ఎం.మహదేవమ్మ రూ.94.80 లక్షలు విలువైన 753 గ్రాములున్న 7 బంగారు పతకాలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలకు బంగారు పతకాలను అందజేశారు.

# ఎంపీ దగ్గుమళ్లకు ఘన సత్కారం




చిత్తూరు, మహి న్యూస్ ఏప్రిల్ 24: తెలుగుదేశం పార్టీ అత్యున్నత విభాగమైన పోలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎంపికైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఉదయం ఎంపీ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఆయనకు శాలువా కప్పి పూలమాలలతో అభినందనలు తెలిపారు. పార్టీలో కీలక బాధ్యతలు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బి.ఎన్. రాజసింహులు, సురేంద్ర కుమార్, రాజేష్ కుమార్ రెడ్డి, నరేష్ చౌదరి, ఈశ్వర్ నాయుడు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# వైద్యా ఆరోగ్య రంగంలో డిజిటల్ నెర్వ్ సెంటర్ గేమ్ ఛేంజర్

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24: రోగుల వైద్య రికార్డులను అస్పత్రులు, ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలతో అనుసంధానం చేసే తొలి డిజిటల్ నెర్వ్ సెంటర్ కుప్పంలో మంచి ఫలితాలు సాధించుచున్నది జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, టాటా డిజిటల్ నేర్వ సెంటర్ ద్వారా సంజీవని అమలపై 9 జిల్లాల వైద్య సిబ్బందికి, శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం కుప్పం పట్టణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని తొలి డిజిటల్ నెర్వ్ సెంటర్ ను కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఆవిష్కరించారు. సంజీవని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి మంచి ఫలితాలు సాధించుచున్నది ఈ డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా రోగుల వైద్య రికార్డులను ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో అనుసంధానించారు. వ్యక్తిగత వైద్య రికార్డుల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండేలా డిజిటల్ నెర్వ్ సెంటర్ సేవలు అందించనుంది. సకాలంలో రోగ నిర్ధారణ, వైద్య నిపుణుల అప్పాయింట్మెంట్, వ్యక్తిగత కౌన్సిలింగ్ తదితర సేవల్ని డిజిటల్ నెర్వ్ సెంటర్ అందించనుంది. వర్చువల్ విధానంలోనూ రోగికి వైద్య నిపుణుల్ని అందుబాటులోకి తీసుకువచ్చి చికిత్స అందించే వెసులుబాటు కలుగనుంది. ప్రతి పిహెచ్సి నందు నాలుగు లాగిన్స్ పిసిసి ,స్టాఫ్ నర్స్, డాక్టర్ ,ఎల్ టి, ఫార్మసిస్ట్ తప్పనిసరిగా అందరూ ఓపి పేషెంట్స్ కు 100% చేయాలని తెలిపారు .సంజీవని ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ కొరకు మీ వంతు సహకారం అందించాలని కోరారు తద్వారా సులభంగా వెనకటికి పేషెంట్స్ కు చికిత్స ఇవ్వడం జరుగుతుందన్నారు. హెల్త్ సిస్టంలో అందరూ కలిసి పనిచేస్తే ఖచ్చితమైన డిజిటల్ డేటా ఎంట్రీ విత్ ఆబ ఐ డి తో భవిష్యత్ పునః పరిశీలనకు(సులభ చికిత్సకు) తోడ్పడుతుందని తెలిపారు. సంజీవిని టాటా డిఐఎన్సీ టోల్ ఫ్రీ నెంబర్ 155337 సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 9 నుండి సాయంత్రం 4 వరకు సంప్రదించవచ్చునని ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలోకి మార్చడం పై కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ నాగ శశి భూషణ రెడ్డి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, టాటా కన్సల్ట్ ట్రైనర్, తపాన్ దాసు, అన్నమయ్య, తిరుపతి, కడప, శ్రీ సత్య సాయి అనంతపురం, నంద్యాల, కర్నూల్, మార్కాపురం, నెల్లూరు, జిల్లాలకు సంబంధించిన డీపీఎంఓ, డీపీఓ, మెడికల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పియండియస్ విత్తనాలు వేయండి... టేకుమూడి లక్ష్మణరావు




తాళ్ళరేవు, మహి న్యూస్, ఏప్రిల్ 24.: కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యంటి శ్రీమతి ధనలక్ష్మి ఆధ్వర్యంలో దాళ్వా పంట అనంతరం పంట భూమి లో కావలసిన పోషకాలు కి సంబంధించి 18 రకాల విత్తనాలు తో కిట్స్ తయారు చేశారు, ఈ కార్యక్రమం లో రాష్ట్ర శెట్టిబలిజ కోర్పరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాటలాడుతూ వ్యవసాయ సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయం తో పనిచేసి తాళ్ళరేవు మండలం లో అధిక శాతం ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలన్నారు, వ్యవసాయ అధికారి శ్రీమతి ప్రశాంతి మాటలాడుతూ పియండియస్ విత్తనాలు విలువ ప్రతీ రైతు తెలుసుకునే లా ప్రచారం చేస్తామని చెప్పారు, ఈ కార్యక్రమం లో ప్రకృతి వ్యవసాయ రైతు ధూళిపూడి వెంకటరమణ (బాబి),ప్రియాంక, సతీష్, వెంకటలక్ష్మి, భవిని, రవలి, భవాని మొండి, చిరంజీవి, ఝాన్సీ, అరుణ, వాడపల్లి, సూర్య కుమారి, పుణ్యమంతుల దుర్గ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా రిజర్వేషన్లపై విపక్షాలది రాజకీయ స్వార్థం

## ఎన్డీఏ చిత్తశుద్ధిని శంకించడం సరికాదు
## డీలిమిటేషన్ జరిగితేనే మహిళా బిల్లుకు సంపూర్ణ న్యాయం
## దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి అన్యాయం జరగదు
## ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ప్రతిపక్షాలు కేవలం రాజకీయ స్వార్థంతోనే అడ్డుకుంటున్నాయని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం చిత్తూరులోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సాధికారత సాధించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని చూసి ఓర్వలేకనే విపక్షాలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ (డీలిమిటేషన్) ప్రక్రియ పూర్తయితేనే మహిళా రిజర్వేషన్లకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని ఎంపీ స్పష్టం చేశారు. 1971 నుంచి పార్లమెంట్ సభ్యుల సంఖ్య పెరగలేదని గుర్తు చేస్తూ, పెరిగిన జనాభాకు అనుగుణంగా నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించడం ద్వారానే చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లను పారదర్శకంగా అమలు చేయగలమని అభిప్రాయపడ్డారు. 2023లో ఆమోదం పొందిన బిల్లులోని క్లాజ్ ప్రకారం.. జనాభా లెక్కల అనంతరం డీలిమిటేషన్ ప్రాతిపదికనే కొత్త రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని ఆయన వివరించారు. ఈ బిల్లుల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదని ఎంపీ కొట్టిపారేశారు. "ఈ బిల్లుల ద్వారా దక్షిణాది రాష్ట్రాల హక్కులకు ఎలాంటి భంగం కలగదు. దీనిపై పూర్తి అవగాహన ఉండబట్టే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ బిల్లులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు," అని ఆయన తెలిపారు. మహిళలకు రాజకీయ సమానత్వం కల్పించిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందనే అసూయతోనే ప్రతిపక్షాలు ఈ చారిత్రాత్మక బిల్లును అడ్డుకుంటున్నాయని దుయ్యబట్టారు. ఎన్డీఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని లోక్‌సభలో బిల్లులను ప్రవేశపెట్టిందని, దీనికి సహకరించకుండా విపక్షాలు రాజకీయ రంగు పులమడం సరికాదన్నారు. మహిళా సాధికారతకు అడ్డుపడుతున్న ప్రతిపక్షాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ సంఘం ప్రతినిధి త్యాగరాజన్, టీడీపీ సీనియర్ నేతలు సురేంద్ర కుమార్, కోదండ యాదవ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవ కార్యకలాపాలపై టీటీడీ అదనపు ఈవో సమీక్ష

తిరుమల,మహి న్యూస్, ఏప్రిల్ 24: శ్రీవారి సేవ కార్యకలాపాలపై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి శుక్రవారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశం మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకులకు సేవల కేటాయింపు, భక్తులకు





సేవలు అందించే విధానంపై ముందస్తు శిక్షణ, సంబంధిత విభాగాల సిబ్బంది సేవకులతో నడుచుకోవాల్సిన విధానం, సేవకుల నుండి ఫిర్యాదులు అందితే తక్షణ పరిష్కారం వంటి అంశాలపై సమావేశంలో సమీక్షించారు.

### సమావేశంలోని ముఖ్యాంశాలు

శ్రీవారి సేవకుల నుండి అత్యుత్తమ సేవలను భక్తులకు అందించడంలో భాగంగా సేవ అనంతరం సంబంధిత సేవకుల అభిప్రాయాలను, అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశం. సేవకుల పనితీరును సమర్థత ఆధారంగా రేటింగ్ చేసే విధానం పారదర్శకంగా అమలు. సేవకుల ఫిర్యాదుల పరిష్కారం కోసం కేంద్రీకృత గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి ప్రత్యేక ఫిర్యాదు నంబర్ ద్వారా తక్షణ పరిష్కార వ్యవస్థ తీసుకురావాలని నిర్ణయం. సంబంధిత విభాగాలు సేవకులకు బాధ్యతలపై స్పష్టత ఇవ్వాలని, శ్రీవారి సేవకుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. సత్సంగ కార్యక్రమాల్లో ప్రముఖ సంగీత విద్వాంసులు, ఆధ్యాత్మిక వక్తలను ఆహ్వానించి సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించేలా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు. తిరుమలలో రద్దీ ప్రాంతాల్లో ఆచరణ నియమాలు, నైతిక, ఆధ్యాత్మిక విలువలను తెలియజేసే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయం. భక్తులు, సేవకులు, ఉద్యోగుల మానసిక ప్రశాంతత కోసం హీలింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు. రిటైర్డ్ సీనియర్ అధికారులను శ్రీవారి సేవ పర్యవేక్షకులుగా వినియోగించే అంశంపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచన. ఈ సమావేశంలో సీపీఆర్వో డాక్టర్ టి.రవి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, సోమన్నారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రమాకాంత్, పీఆర్వో (ఎఫ్ఏసీ) కుమారి నీలిమ, ఐటీ డిప్యూటీ జీఎం వెంకటేశ్ నాయుడు, అశ్వనీ ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ సుబ్బారెడ్డి, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు..

## కాకినాడ జిల్లాలో 3,162 విద్యార్థుల కోసం 11 పరీక్షా కేంద్రాలు సిద్ధం..




కాకినాడ, మహి న్యూస్, ఏప్రిల్24 : జిల్లాలో మే నెల 03న నిర్వహించనున్న జాతీయ స్థాయి నీట్ పరీక్షను సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నీట్ పరీక్ష సక్రమ నిర్వహణపై శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. రెవెన్యూ, బ్యాంకు పోలీస్, పోస్టల్, విద్యా, వైద్య, అగ్నిమాపక, ప్రజా రవాణా, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మే నెల 03న జరగనున్న జాతీయ స్థాయి నీట్ పరీక్షకు జిల్లాలో మొత్తం 11 పరీక్షా కేంద్రాల్లో 3,162 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. మధ్యాహ్నం 02 రెండు గంటల నుంచి సాయంత్రం 05 గంటల వరకు (పీడబ్ల్యూ విద్యార్థులకు 6 గంటల వరకు) పరీక్ష జరిగే ప్రతి కేంద్రంలో తగిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ హాజరు వంటి చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష నిర్వహణ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలను చోటు చేసుకోకుండా పరీక్షా కేంద్రాలు, వాటి చుట్టుపక్కల బీఎన్ఎస్-ఎస్ సెక్షన్-163 (సీఆర్.పీ.సీ. కింద సెక్షన్ 144(2)) ను పటిష్టంగా అమలు చేయలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు పోలీస్ శాఖ ద్వారా చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన పూర్తి సిబ్బందిని ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. విద్యార్థులకు సకాలంలో రవాణా సౌకర్యం కల్పించేలా ప్రజా రవాణా శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల రూటులలో ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా ఉండేలా విద్యుత్ శాఖకు, వైద్య శిబిరంతో పాటు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పోస్టల్ శాఖ పరీక్షా పత్రాల రవాణా, భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. బ్యాంకుల్లో పరీక్షా పత్రాల భద్రం, ప్రశ్నాపత్రాల స్వీకరణ, స్టోరేజ్, ఉపసంహరణ, పరీక్షా కేంద్రాలకు తరలింపు, పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ప్రాథమిక సౌకర్యాల కల్పన, పరీక్షా నిర్వహణ వంటి అంశాలు ప్రతి దశలోను ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో విజయవంతంగా నీటి పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో కాకినాడ జిల్లా నీట్ నోడల్ అధికారి, డీఆర్వో డా.టి. తిప్పేనాయక్, డీఈవో పి.రమేశ్, జిల్లా అగ్నిమాపక అధికారి సుబ్బారావు, వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్ఓ డా చలమయ్య, నీట్ పరీక్ష సిటీ కోఆర్డినేటర్ కే.విజయ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా చదివితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు



అద్దంకి, మహి న్యూస్, ఏప్రిల్ 24: ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ధీటుగా చదివితేనే.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలంలో శుక్రవారం నాడు మంత్రి గొట్టిపాటి పర్యటించారు. ముక్తేశ్వరం, చెన్నుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 96 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన... కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలో పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, బ్యాగు, షూస్ కూడా అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం ద్వారా చదువుకునే విద్యార్థులు ఒక్కొక్కరికీ సంవత్సరానికి రూ.15,000 జమ చేసినట్లు చెప్పారు. అద్దంకి నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు దాతల సహకారంతో సుమారు 11,200పైగా సైకిళ్లను విద్యార్థులకు అందించామన్నారు. గతంలో ఒక్కో పాఠశాలకు ఒక్క టీచర్ ఉండేవారని దాని వలన విద్యార్థులు ఇబ్బంది పడేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో డీఎస్సీ ద్వారా ఒకేసారి 16,400 టీచర్ పోస్టులను భర్తీ చేశారని, దీనితో అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థులందరికీ తల్లికి వందనం అందేలా చూడాల్సిన బాధ్యత ఎంఈవోదే అని ఆయన స్పష్టం చేశారు. గ్రామ పెద్దలు కూడా అప్పుడప్పుడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసి నాణ్యత పరీక్షించాలని కోరారు. అదే విధంగా అందరికీ రైతు భరోసా అందుతుందా., ఉపాధి హామీ సరిగా అమలవుతుందా అనే విషయాల్లో సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి అని పిలుపునిచ్చిన మంత్రి గొట్టిపాటి., దీనికి అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.



### రూ.8 వేల కోట్లతో ఆర్డీఎస్-ఎస్ పనులు...

అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవలో శ్రీసీతారామ ఆంజనేయ స్వామి ఆలయానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం నాడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., గ్రామ ప్రజల రూ.50 లక్షల విరాళాలకు తోడుగా ఆలయ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.1 కోటి సీజీఎఫ్ నిధులను మంజూరు చేసిందన్నారు. అనంతరం బల్లికురవ ఎస్సీ కాలనీకి చేరుకున్న మంత్రి గొట్టిపాటి., 30 ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల సోలార్ కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2కేవీ సామర్థ్యం కలిగిన రూ.1.25 లక్షల విలువైన సోలార్ యూనిట్లను ఉచితంగానే అందిస్తున్నామని తెలిపారు. 3 కేవీ సామర్థ్యం కలిగిన సోలార్ కనెక్షన్ తీసుకునే బీసీలకు రూ.98 వేలు, ఓసీలకు రూ.78 వేలు సబ్సిడీ అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. సోలార్ రూఫ్ టాప్ యూనిట్ల కోసం ముందుకు వచ్చే అందరికీ కనెక్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. అదే విధంగా రూ.8 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీఎస్-ఎస్ పనులు చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఆర్డీఎస్ఎస్ పనులు పూర్తి అయితే గ్రామాల్లోనూ 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా, రైతులకు పగటి పూటే 9 గంటల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘార్ పథకం కింద వచ్చే వారానికి 1000 కి పైగా సోలార్ రూఫ్ టాప్ లను ఇన్స్టాల్ చేయాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 24:- పీఎం సూర్యఘార్ పథకం కింద వచ్చే వారానికి 1000 కి పైగా సోలార్ రూఫ్ టాప్ లను ఇన్స్టాల్ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ని ఆదేశించారు. శుక్రవారం స్థానిక బీడీ వర్కర్ కాలనీ లోని గౌరమ్మ ఇంటి మీద ఏపీఎస్పీడీసీఎల్ వారి ఆధ్వర్యంలో పీఎం సూర్యఘార్ పథకం కింద యుఎల్ఏ మోడల్ లో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్ ను కలెక్టర్ పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్దిదారులు గౌరమ్మ తో మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఇన్స్టాలేషన్ ఎప్పుడూ చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. సోలార్ రూఫ్ టాప్ ఇన్స్టాల్ చేసుకోవడం ద్వారా వినియోగదారులు కేవలం ఉచిత విద్యుత్తును వాడుకోవడమే కాకుండా, విద్యుత్ ఉత్పత్తిదారులుగా కూడా మారుతారని కలెక్టర్ పేర్కొన్నారు.. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ఇది పూర్తిగా ఉచితమని, ఇతరులకు మొదటి కిలో వాట్ కి 30 వేల రూపాయలు, రెండో కిలో వాట్ కి 30 వేల రూపాయలు, 3 కిలో వాట్ కి 78 వేల రూపాయల వరకు సబ్సిడీ వస్తుందన్నారు.. ప్రజలు ఈ పథకమును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో పీఎం సూర్యఘార్ పథకం కింద 23,077 సోలార్ రూఫ్ టాప్ లు శాంక్షన్ అయ్యాయని, ఇందులో ఇప్పటివరకు 3, 038 సోలార్ రూఫ్ టాప్ లను ఇన్స్టాల్ చేసి రాష్ట్రంలో కర్నూలు జిల్లా 2వ స్థానంలో ఉన్నామన్నారు. పీఎం సూర్యఘార్ పథకం కింద వచ్చే వారానికి 1000 కి పైగా సోలార్ రూఫ్ టాప్ లను ఇన్స్టాల్ చేయాలన్నారు. రోటోమాగ్, బృహస్పతి కంపెనీ వారు ఇన్స్టలేషన్ ప్రక్రియ లో నెమ్మదిగా ఉన్నారని, వేగవంతంగా సోలార్ రూఫ్ టాప్ ఇన్స్టలేషన్ ప్రక్రియ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్, కర్నూలు టౌన్ ఈఈ శేషాద్రి, ఏపీఎస్పీడీసీఎల్ డిఈ విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం విస్తరించాలి




కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 24: ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం విస్తరించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడంలో పీఎండీఎస్ ప్రధాన పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు మండలం తడకనపల్లి గ్రామంలో ధర్తీ మాతా బచావ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు పీడీఎంఎస్ విత్తనాల కిట్లను అందజేసి, ప్రకృతి వ్యవసాయం సాగు చేసిన రైతులు పంటలను పరిశీలించారు. అనంతరం కె. రాముడు పొలంలో పిడిఎమ్ఎస్ విత్తనాలను చల్లి పీడీఎంఎస్ విత్తనాల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎండీఎస్ అంటే వర్షాధారిత ప్రాంతాలలో, భూమిలో తేమ లేనప్పుడు విత్తనాలు వేసే విధానం అని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వేసవిలో భూమి ఖాళీగా ఉన్నప్పుడు, వర్షాలు పడటానికి ముందే (మే-జూన్ సమయంలో) 30 రకాల నవధాన్యాలు, ఇతర విత్తనాలను కలిపి పొలంలో చల్లుతారని, ఈ విత్తనాలు వర్షం పడగానే మొలకెత్తి, భూమికి అవసరమైన పోషకాలను అందిస్తాయని తెలిపారు. రైతులు ప్రకృతి సాగు విధానాన్ని అనుసరించాలని, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఒక మహిళ రైతు 70 సెంట్ల భూమిలో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసి సంవత్సరానికి రూ.2.50 లక్షల ఆదాయం పొందిన విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. రసాయన ఎరువులతో సాగు చేసిన వంకాయ పంట మరియు సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంట మధ్య తేడాను ప్రత్యక్షంగా గమనించామని, సేంద్రియ పద్ధతులు రైతులకు దీర్ఘకాలిక లాభాలను అందిస్తాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, మొదటిసారి ప్రారంభించే రైతులు కనీసం తమ భూమిలో 50 శాతం ప్రాంతంలో సేంద్రియ పద్ధతులను అమలు చేసి ఫలితాలు పరిశీలించాలని సూచించారు. భూమి ఆరోగ్యం కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, రసాయన వ్యవసాయం వల్ల భూమి సారం తగ్గడంతో పాటు అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా, రైతులు బహుళ పంటలు సాగు చేయాలని, పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు వంటి పశువులను పెంచడం ద్వారా అదనపు ఆదాయం పొందడమే కాకుండా, ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన సేంద్రియ ఎరువులు కూడా సిద్ధం చేసుకోవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ సంఘాల్లో సభ్యత్వం పొందితే, ఆధునిక వ్యవసాయ యంత్రాలు తక్కువ ధరలో అందుబాటులోకి వస్తాయని, అందువల్ల తప్పనిసరిగా సంస్థల్లో నమోదు కావాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి నీటి పొదుపు పద్ధతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, ఇతరులకు 60-70 శాతం వరకు సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. అలాగే జలధార--జలహారతి వంటి కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాల పెంపుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తున్నప్పటికీ, ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, తహశీల్దార్ ఆంజనేయులు, గ్రామ పెద్దలు జుబేదా, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 30 వ తేదీన పర్ల వద్ద హెచ్ పీసీఎల్ ఎల్పీజీ పైప్ లైన్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణ

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 24: ఈ నెల 30 వ తేదీన పర్ల వద్ద హెచ్ పీసీఎల్ ఎల్పీజీ పైప్ లైన్ మాక్ ఎక్సర్సైజ్ ను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శుక్రవారం నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ కమాండెంట్ ఆదిత్య కుమార్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఈ నెల 30 వ తేదీన రాష్ట్రమంతటా నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఏర్పాట్లపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ, ఈ నెల 30 వ తేదీన పర్ల వద్ద హెచ్ పీసీఎల్ ఎల్పీజీ పైప్ లైన్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఆర్డీవో ఇన్సిడెంట్ కమాండర్ గా వ్యవహరిస్తారన్నారు. ప్రమాదం జరిగినటపుడు ఏమేమి చర్యలు తీసుకుంటామో, ఆ విధంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వైద్య సహాయం అందించడం వంటి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పర్లకు దగ్గరలో ఉన్న విశ్వభారతి హాస్పిటల్ లో వైద్య సహాయక చర్యలు, అలాగే జనరల్ హాస్పిటల్ లో బెడ్ల ఏర్పాటు, వైద్య సిబ్బంది, 108, అంబులెన్స్ ల ఏర్పాటు తదితర చర్యలన్నీ తీసుకోవాలని హాస్పిటల్స్ సూపరింటెండెంట్, డి ఎం హెచ్ వో లను ఆదేశించారు. అలాగే ఎస్డీఆర్ఎఫ్ , ఫైర్, పోలీస్, ఆర్టీసీ తదితర శాఖలకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్లో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, డిఎంహెచ్ఓ డా. కామేశ్వర ప్రసాద్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీసీ హెచ్ ఎస్ డా. జఫ్రుల్లా, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో తాగునీటి పరిస్థితిపై మంత్రి - కలెక్టర్ సమీక్ష




నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 24:- నంద్యాల పట్టణం (అర్బన్), రూరల్ మరియు గోస్పాడు మండలాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ సహా సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నంద్యాల నియోజకవర్గంలో తాగునీటి పరిస్థితిపై మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో నంద్యాల నియోజకవర్గంలోని అర్బన్, రూరల్ ప్రాంతాలు మరియు గోస్పాడు మండలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా కే.సీ. కెనాల్పై ఆధారపడి ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాలో సమస్యలు ఉన్నట్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీ సమన్వయం ఉంటే ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించవచ్చని వారు తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా మున్సిపల్ శాఖ అవసరమైన సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పట్టణాభివృద్ధి అంశంపై మంత్రి, కలెక్టర్ మాట్లాడుతూ, నంద్యాల పట్టణంలో అనియంత్రితంగా జరుగుతున్న నిర్మాణాలను నియంత్రించి, క్రమబద్ధమైన అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ సుందరీకరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, అలాగే స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి పట్టణాన్ని శుభ్రతలో ముందంజలో నిలపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

## జలధార-జల హారతి ద్వారా గ్రామాల్లో నీటి వనరుల పునరుద్ధరణ

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 24: జలధార--జల హారతి పనులతో నీటి భద్రతను బలోపేతం చేస్తూ భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా నీటి వనరులను పునరుద్ధరించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామంలో జలధార - జల హారతి కార్యక్రమంలో భాగంగా చౌడమ్మ కుంట చెరువు, భద్రుడు చెక్ డ్యామ్ పనులకు కలెక్టర్ భూమి పూజ చేసి పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పరిసర ప్రాంతాల్లో ఉన్న ఎత్తు ప్రాంతం నుండి వర్షపు నీరు క్రింది ప్రాంతమైన అమకతాడు చౌడమ్మ చెరువు, భద్రుడు చెక్ డ్యామ్లకు చేరుకునేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ చెక్ డ్యామ్ సుమారు 20 మీటర్ల లోతు, 200 మీటర్ల పొడవుతో నిర్మించబడుతూ, దాదాపు 18 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. దీని ద్వారా సుమారు 15 హెక్టార్ల వ్యవసాయ భూమికి సాగునీరు అందించవచ్చని వివరించారు. ఇక గ్రామంలోని ఉప్పువంక, పడమరవంక, ఇతర వంకల ద్వారా హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాలువను చెరువులు, కుంటలు, కాలువలతో అనుసంధానం చేసే పనులు, మరమ్మత్తులు, పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నామని తెలిపారు. హంద్రీ-నీవా కాలువ నీటిని సమర్థవంతంగా వినియోగించుకుని ఈ ప్రాంతంలో సాగునీరు మరియు భూగర్భ జలాలను పెంచే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ చర్యల వల్ల బోర్వెల్స్కు నీటి లభ్యత పెరిగి భూగర్భ జలాలు గణనీయంగా మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రజలకు సాగునీరు, త్రాగునీరు సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జలధార--జల హారతి కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను కనీసం 3 మీటర్ల మేర పెంచడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నామని చెప్పారు.



జిల్లాలోని 246 ఎం.ఐ ట్యాంక్లకు అనుసంధానంగా కాలువలు, పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ వంటి మొత్తం 3,445 పనులను గుర్తించామని, వీటిని వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం అక్కడ పనులు చేస్తున్న వేతనదారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రామికులు ఉదయం 6 గంటలకే పనులకు హాజరై ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అక్కడ ఉన్న రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..., ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని, దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా బహుళ పంటల సాగు పద్ధతిని అనుసరించడం ద్వారా రైతులు ఆర్థికపరంగా మరింత స్థిరత్వం సాధించగలరని తెలిపారు. ముఖ్యంగా మిల్లెట్స్కు చెందిన పంటలను ఎక్కువగా సాగు చేయడం ద్వారా పోషక విలువలతో పాటు మార్కెట్లో మంచి డిమాండ్ కూడా లభిస్తుందని వివరించారు. అదేవిధంగా, పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడం రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతుందని, ఆవులు, మేకలు, గొర్రెల వంటి పశువులను పెంచుకోవడం ద్వారా నిరంతర ఆదాయం పొందడమే కాకుండా సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన ఎరువులు కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. వ్యవసాయం మరియు పశు పోషణను సమన్వయం చేసుకుంటే రైతుల జీవనోపాధి మరింత బలపడుతుందని పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఆ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రభుత్వం ఇచ్చే సూచనలు పాటించి సహకరించాలని కలెక్టర్ కోరారు. రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే వ్యవసాయ రంగం మరింత పురోగతి సాధిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి నరసింహారెడ్డి, ఇరిగేషన్ ఎస్.ఈ బాలచంద్రారెడ్డి, పత్తికొండ ఆర్డీఓ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబీ, మాజీ శ్రీశైలం దేవస్థానం డైరెక్టర్ మర్రి శ్రీనివాసులు, సాగర కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.వి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా 6-14 సంవత్సరాల పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 24:- "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా 6-14 సంవత్సరాల పిల్లలందరినీ బడిలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి మండల కేంద్రం హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చేర్పించే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.. అనంతరం ఇంటింటికి వెళ్లి విద్యార్థులను, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, వసతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 14 సంవత్సరాల పిల్లలను వంద శాతం బడిలో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఎన్రోల్మెంట్ డ్రైవ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటింటికి వెళ్లి, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలలో ఉన్న సౌకర్యాలను, వివరించి వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ముందుగా 5 వ తరగతి చదవడం పూర్తై 6 వ తరగతి కి వెళ్తున్న విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి రోజూ డిక్షనరీ నుండి కొత్త 5 రకాల ఇంగ్లీష్ పదాలను నేర్చుకోవాలన్నారు. న్యూస్ పేపర్ చదువుకోవాలని, స్టోరీ బుక్స్ చదువుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు బయట తిరగకూడదన్నారు. ఎక్కువ నీరు తాగాలన్నారు.. టీచర్లు విద్యార్థులపై చూపే శ్రద్ధను కలెక్టర్ ప్రశంసిస్తూ, "ఉపాధ్యాయులు ఎంత బాగా కేర్ తీసుకుంటే అంత మంది పిల్లలు పాఠశాలలో చేరుతారని" కలెక్టర్ పేర్కొన్నారు. 5 వ తరగతి పూర్తి చేసిన 41 మంది విద్యార్థులు 100 శాతం సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో 6 వ తరగతి చేరడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ నుండి 1 వ తరగతికి నూతన అడ్మిషన్ తీసుకున్న పిల్లలతో కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లా, మండలం, గ్రామం పేర్లు అడగగా వారు చాలా చక్కగా సమాధానం ఇవ్వడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడి సెంటర్ లో ఏ ఏ భోజనాలు పెట్టేవారు అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న 42 మంది పిల్లలో, 36 మంది పిల్లలు ఫస్ట్ క్లాస్లో అడ్మిషన్ తీసుకున్నారని, మిగిలిన వారు కూడా ఎన్రోల్మెంట్ అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఉన్న పిల్లలు హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో చేరిన పిల్లలకు కలెక్టర్ తల్లిదండ్రులకు అడ్మిషన్ పత్రాలను అందచేశారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్తున్న పాఠాలకు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలకు సంతృప్తి వ్యక్తం చేసిన తల్లులు**

""బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి మండల కేంద్రం హరిజనవాడలో వరలక్ష్మి, జస్టిన్, మహేశ్వరి ఇళ్లకు కలెక్టర్ వెళ్ళి ప్రభుత్వ బడుల్లో ఉన్న నాణ్యమైన విద్య, వసతులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, రుచి, శుచికరమైన మధ్యాహ్న భోజనం, యూనిఫార్మ్, పుస్తకాలు తదితర వసతులన్నీ కల్పించడం జరుగుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. తల్లులు స్పందిస్తూ తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారని, వచ్చే తరగతికి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే అడ్మిషన్ తీసుకున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు చాలా బాగా ఉన్నాయని, ఉపాధ్యాయులు చాలా బాగా పాఠాలు చెబుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు.. కార్యక్రమంలో డిఈఓ సుధాకర్, సర్వ శిక్ష అభియాన్ పిఓ లోకరాజ్, ఎమ్ ఈ ఓ పద్మావతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేస్తున్నాం

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 24: జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసి, కొత్త పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి ఊతంగా మొత్తం రూ.1.88 కోట్లు ప్రోత్సాహకాలు మంజూరు చేయడంతో పాటు, సామాజిక న్యాయం దృష్ట్యా ఎస్సీ వర్గానికి చెందిన పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రూ. 2.88 కోట్లు ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ అందించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమలు మరియు ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకింగ్ ప్రతినిధులు మరియు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో పరిశ్రమల విస్తరణ, ఎగుమతుల పెంపు కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు అవసరమైన సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందించడం ద్వారా కొత్త పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇది జిల్లాలో ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతుందని తెలిపారు. జిల్లా పరిశ్రమలు మరియు ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ ద్వారా మొత్తం 21 క్లెయిమ్స్కు సంబంధించి కోటి 88 లక్షల 48 వేలు విలువైన

**పరిశ్రమలకు ప్రోత్సాహకాలు.**

జిల్లాలో ప్రోత్సాహకాలు మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఇందులో భాగంగా...

6 కంపెనీలకు ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ కింద రూ. 28 లక్షల 85 వేలు

8 కంపెనీలకు ఇంట్రెస్ట్ సబ్సిడీ కింద రూ. 39 లక్షల 80 వేలు

7 కంపెనీలకు సేల్స్ ట్యాక్స్ సబ్సిడీ కింద రూ. 1కోటి 88 లక్షల 43 వేలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ యువజన.

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కార్యక్రమం కింద కర్నూలు జిల్లాలో సంప్రదాయ చేతివృత్తుల వారు మరియు కళాకారుల




ఆర్థికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ, మొత్తం రూ. 20.71 కోట్ల వ్యయంతో 8,475 యూనిట్లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చర్మ కారులు, బంగారు, మెదలగు పనివారు తదితర సంప్రదాయ వృత్తులలో నిమగ్నమైన వారికి ఆధునిక పరికరాలు, ఆర్థిక సహాయం, శిక్షణ అందించి వారి జీవనోపాధిని బలోపేతం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరిగి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా, ఎస్సీ వర్గానికి చెందిన పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహంగా రూ. 2 కోట్ల 88 లక్షలు మొత్తాన్ని ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ కింద మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇది వెనుకబడిన వర్గాల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొత్త పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చి, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కల్లూరు మండలం తటకనపల్లె గ్రామంలో ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయం కల్పించేందుకు వాటర్ ట్యాంక్ నిర్వహణ పనులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, సీఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో తాజాగా మంజూరు పొందిన ఎంఓఏల పరిధిలో ఇప్పటివరకు 10 యూనిట్లలో ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన యూనిట్లలో కూడా ఫౌండేషన్ స్థాయిని వేగవంతంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరిశ్రమల స్థాపనలో ఎటువంటి ఆలస్యం లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. అలాగే పరిశ్రమలకు సంబంధించిన పన్నుల నిర్వహణ (టాక్స్ మేనేజ్మెంట్) పై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని, ఆదాయ వనరులు సక్రమంగా వినియోగించబడేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా పారదర్శకతతో వ్యవహరించాలని సూచించారు. సి.బి.యన్ విజన్ కార్యక్రమాల అమలులో సంబంధిత శాఖలు పరస్పర సమన్వయం చేసుకుని పనిచేయాలని, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. యువతను స్వయం ఉపాధి వైపు దారితీసే విధంగా "వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్ప్రెన్యూర్" కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వ పథకాలు గ్రామ స్థాయికి సమర్థవంతంగా చేరేలా కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిఎం ఇండస్ట్రీస్ అశోక్ కుమార్, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంఘ అధ్యక్షులు విజయకుమార్ , రాజా మహేంద్ర నాథ్ , కర్నూల్ అడిషనల్ మున్సిపల్ కమిషనర్ ,కృష్ణ, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి , జెడి వ్యవసాయ శాఖ వరలక్ష్మి , ఏపీఎంఐపి పిడి సుధాకర్ , ఎల్డీఎం రామచంద్రరావు , మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, ఎస్సీ ట్రాన్స్కో మహేశ్వర్ రెడ్డి , డి సి ఎల్ వెంకటేశ్వర్లు, డిటిసి శాంతకుమారి , జడ్.ఎం మధుసూదన్ , పరిశ్రమల శాఖ డిడి లు జవహర్ బాబు, డేనియల్ , డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి,మాధురి, డిడి గ్రౌండ్ వాటర్ సునీల్ కుమార్, ఫైర్ ఆఫీసర్ అవినాష్ జయసింహా , ఏ. డి. హార్టికల్చర్ రాజా కృష్ణా రెడ్డి , డి ఎస్ డబ్ల్యూ ఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 30న ఎస్ పి వై ఇండస్ట్రీస్ లిమిటెడ్ నందు ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్

నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 24:- ఈనెల 30 వ తేదీన నంద్యాల పట్టణంలోని ఎస్ పి వై ఇండస్ట్రీస్ లిమిటెడ్ నందు ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ సచివాలయం నుంచి డిజాస్టర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ ప్రకర్ జైన్, ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డిఆర్ఓ రాము నాయక్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాల వల్ల అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వాటిని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలకు సంబంధించి ఈనెల 30 వ తేదీన నంద్యాల పట్టణంలోని ఎస్ పి వై ఇండస్ట్రీస్ లిమిటెడ్ నందు మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు తదితర విపత్తుల నుండి సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరై మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## గౌరవ వేతనాలకు 30 లోగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24 : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇమామ్ మోజోన్లకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాలకు మసీదులకు సంబంధించిన పత్రాలను ఈ నెల 30వ తేదీలోగా అందజేయాలని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి సి.పార్థసారథి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా మసీదులకు చెందిన ఇమామ్ మోజోన్లకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాలు విడుదలవుతాయని, మసీదు కమిటీ ప్రెసిడెంట్ లేదా ముతవల్లీలు ఆయా డాక్యుమెంట్లను, మసీదు రిజిస్ట్రేషన్, మసీదుకు సంబంధించిన స్థలం పత్రాలను గుంటూరు కలెక్టర్ ఆఫీస్ లోనే జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయానికి కచ్చితంగా సమర్పించాలని అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని మసీదులు ఉమ్మీద్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు గుంటూరు, బాపట్ల జిల్లాల వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్, సెల్ నెంబర్, 7331157344 మరియు 9885142258 సంప్రదించవచ్చని వివరించారు.

## 25న ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్

**గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 24 : ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ ను ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్ఆర్ శంకరన్ సమావేశం మందిరంలో ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందని చెప్పారు. ఎస్.సి, ఎస్.టి, దివ్యాంగ అభ్యర్థులు తమ సమస్యలను విన్నవించవచ్చని ఆయన చెప్పారు.**

## మోడరన్ లాంగ్వేజ్ ఉర్దూ సాంక్షన్ పోస్ట్ ను కొనసాగించాలి



రాయచోటి, మహిన్యూస్, ఏప్రిల్ 24 : రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మోడరన్ లాంగ్వేజ్ ఉర్దూ సాంక్షన్ పోస్ట్ ను కొనసాగించాలని అంజుమన్ తరక్కీ ఉర్దూ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మొహమ్మద్ హాషిం కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఎన్నో సంవత్సరాల నుండి ముస్లిం మైనారిటీలు మోడరన్ లాంగ్వేజ్ను ఆప్షనల్ లాంగ్వేజ్ గా ఎన్నుకొని చదువుతున్నారని, 2026- 27 విద్యా సంవత్సరానికి గాను ద్వితీయ సంవత్సరంలో దాదాపు 20 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఫస్ట్ ఇయర్ లో కూడా చాలామంది విద్యార్థులు తమ మాతృభాషను చదవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఉన్నట్టుండి హఠాత్తుగా మోడరన్ లాంగ్వేజ్ ఉర్దూ సాంక్షన్ పోస్టును తీసివేసిన ఎడల విద్యార్థులు నష్టపోతారని వారి భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. మోడరన్ లాంగ్వేజ్ ఉర్దూ సాంక్షన్ పోస్టును కొనసాగించి ముస్లిం మైనారిటీ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

## హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడిగా దివాకర్ రెడ్డి నియామకం

### పేదలు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి



పులివెందుల /వేంపల్లి మహి న్యూస్ ఏప్రిల్ 24: హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ వేంపల్లి మండల అధ్యక్షుడిగా వల్లూరు దివాకర్ రెడ్డిని నియమించారు. జాతీయ అధ్యక్షుడు నందం నరసింహ రావు ఆదేశాల మేరకు కడప జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలపై కఠినంగా పోరాడతానని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే అక్రమాలు, అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేయడం తన ప్రధాన లక్ష్యమని దివాకర్ రెడ్డి తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు నందం నరసింహ రావు, జిల్లా అధ్యక్షుడు ముని యాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నాగేశ్వరమ్మ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న

### - డాక్టర్ తులసి రెడ్డి




పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 24: పులివెందుల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్. నాగేశ్వరమ్మ పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ తులసిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమని, ఆ ప్రక్రియలో భాగంగా నాగేశ్వరమ్మ సేవా కాలం ముగిసిందని తెలిపారు. అన్ని జీవరాశుల్లో మానవ జన్మ అత్యుత్తమమైనదని, జీవితాంతం సమాజ సేవ కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. నాగేశ్వరమ్మ శేష జీవితం ఫలప్రదంగా, జయప్రదం గా, శుభప్రదంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గురుప్రసాద్, రవీంద్ర, కేశవ, సుజాత, శైలజ, ప్రభాకర్‌తో పాటు వివిధ హాస్టల్ సిబ్బంది, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బండారు వెంకటేశు, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



పులివెందుల /వేంపల్లె మహి న్యూస్ ఏప్రిల్ 24: స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి డా. ఎల్. నాగలక్ష్మి దేవి ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డా. ఎల్. నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ స్థానిక స్వపరిపాలన వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. యువత గ్రామాభివృద్ధిలో చురుకుగా పాల్గొనాలని, పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా పాల్గొన్న చరిత్ర అధ్యాపకులు డా. బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థ బలోపేతం అయినప్పుడే దేశం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రాచీన కాలం నుంచే గ్రామాలకు స్వయం ప్రతిపత్తి ఉన్న వ్యవస్థ కొనసాగుతోందని, మౌర్యుల కాలంలో దానికి బలమైన పునాది పడిందని వివరించారు. అనంతరం గ్రంథాలయ శాఖాధిపతి డా. పి. మాధవరావు మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థ బలపడినప్పుడే కేంద్ర ప్రభుత్వం పటిష్టంగా నిలుస్తుందని తెలిపారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు బలం చేకూర్చిన చర్యలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాఖాధిపతి డా. మల్లేశ్వరమ్మ, ఉర్దూ అధ్యాపకురాలు షేక్ రేష్మ, కంప్యూటర్ శాఖాధిపతి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి

### విజయభారతి పాఠశాల కాన్వకేషన్‌లో మాజీ ఇంచార్జీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

### విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం అవసరం



పులివెందుల /వేంపల్లె మహి న్యూస్ ఏప్రిల్ 24: విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే నైతిక విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందని మాజీ ఇంచార్జీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని విజయభారతి పాఠశాలలో కాన్వకేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాచినేని శ్రీనివాసులు, పచ్చిపులుసు మురళీ కిషోర్, బైరిశెట్టి బాల గంగాధర్, గాలి హరి ప్రసాద్, కసిరెడ్డి ఆది లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య అన్నది అన్ని సంపదల్లో ప్రధానమైనదని తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, నైతిక విలువలు విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యార్థి దశను సద్వినియోగం చేసుకుంటే జీవితంలో రాణించవచ్చని పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ప్రకృతి నుండి కూడా అనేక విషయాలు నేర్చుకోవాలని రాచినేని శ్రీనివాసులు సూచించారు. కుంటలు, చెరువుల వద్ద ప్రమాదాలకు గురికాకూడదని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 19 వ వార్డులోని ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

### సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు



రాయచోటి, మహిన్యూస్, ఏప్రిల్ 24 : మున్సిపాలిటీ పరిధిలో 19 వ వార్డులో మహబూబ్ బాషా, గవర్నర్ వీధులలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి, మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అనేక వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే మురుగు నీరు వీధుల్లోనే నిలిచిపోవడంతో దోమలు పెరిగి, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం కారణంగా పరిశుభ్రత కూడా దెబ్బతింటుందని విమర్శించారు. అలాగే వీధి దీపాలు సరిగా లేక రాత్రి వేళల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. పేదవారికి నివాస స్థలాలు కేటాయింపులో జాప్యం జరుగుతోందని, దీనిపై అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ఇప్పటికైనా అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు మున్సిపల్ అధికారులు స్పందించి సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణం, తాగునీటి సరఫరా, చెత్త నిర్వహణ, వీధి దీపాల మరమ్మతులు వంటి సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి జగన్ బాబు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యు బత్తల వెంకటరమణ, ఆంజనేయులు, వాసుదేవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ కన్వర్జెన్స్ శిక్షణ కార్యక్రమం




గాలివీడు:ఏప్రిల్24(మహి న్యూస్ ): మండలంలోని గోపనపల్లి గ్రామంలో ఆర్ఎస్కే పరిధిలో మండల వ్యవసాయ అధికారి గౌతమి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల మండల స్థాయి ప్రకృతి వ్యవసాయ కన్వర్జెన్స్ శిక్షణ కార్యక్రమం తొలి రోజు విజయవంతంగా జరిగింది. ఈ శిక్షణలో అగ్రికల్చర్ సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వివిధ వ్యవసాయ మోడళ్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాఫ్ మూన్ మోడల్ మరియు డీఆర్‌పీఎం (డ్రౌట్ ప్రూఫింగ్ మోడల్) పై వివరంగా చర్చించారు. ఈ మోడళ్ల ద్వారా వర్షాధార భూముల్లో నీటి సంరక్షణ, నేల తేమ నిలుపుదలతో పాటు పంటల ఉత్పాదకతను పెంచుకోవచ్చని నిపుణులు వివరించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అనుసరించాల్సిన ప్రకృతి వ్యవసాయ విధానాలపై సూచనలు ఇచ్చారు. పీఎండీఎస్ (మాన్సూన్‌కు ముందు విత్తనాల చల్లే విధానం) ప్రాముఖ్యతను వివరించి, వర్షాలు పడకముందే విత్తనాలు చల్లడం ద్వారా పంటల సాగు సులభతరం అవుతుందని తెలిపారు. వర్షాధార భూముల్లో పంటల ఎంపిక, సాగు పద్ధతులపై కూడా మార్గదర్శకాలు అందించారు. ఎంటీ వెంకట జ్యోతి వేరుశనగ పంటలో ఫీల్డ్ విజిట్ నిర్వహిస్తూ, ప్యాకేజ్ ఆఫ్ ప్రాక్టీసెస్ పై వివరించారు. విత్తనాల పెల్లెటైజేషన్ పద్ధతి వల్ల కలిగే ప్రయోజనాలు, ఘన జీవామృతం మరియు ద్రవ జీవామృతం వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాలివీడు మండలానికి చెందిన అగ్రికల్చర్ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం



గాలివీడు:ఏప్రిల్24(మహి న్యూస్): జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాలివీడు పంచాయితీ కార్యాలయం లో జరిగిన ఈ సమావేశంలో మండల ప్రత్యక అదికారి, గాలివీడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు హేమ కుమార్ రెడ్డి మాజీ సర్పంచ్ రియాజ్ ,కూటమి పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీ వో కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ 1993 ఏప్రిల్ 24 నుంచి ప్రథమంగా జాతీయ పంచా యతీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.మండలం లోని శాఖలన్నింటిని కలుపుకుంటు ప్రజా సమస్యలు పరిష్క రించడానికి పంచాయతీరాజ్ శాఖ కృషి చేస్తోందని తెలిపారు.

## ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి




పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 24: ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి అని ఆర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, వైద్యులు శ్రీకాంత్ రెడ్డి,డిఎం ప్రేమ్ కుమార్ లు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు, ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థనాలకు చేర్చవచ్చున్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి వైద్య పరీక్షలను తప్పని సరి చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. సమయానికి ఆరోగ్యం తీసుకోవడం వలన షుగర్ బీపీని కంట్రోల్ చేయవచ్చు అన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమం లో ఆర్టీసీ డ్రైవర్లు,కండక్టర్లు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను మోసం చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

### రేపు జరగబోయే బీసీ గళం బహిరంగ సభను విజయవంతం చేద్దాం

### వైకాపా బీసీ నాయకులు




పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 24: ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో బీసీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన అనంతపురంలో నిర్వహించను న్న బీసీ గళం బహిరంగ సభను విజయవంతం చేయాలని వైకాపా నాయకులు మాజీ చైర్మన్ రసూల్, మాజీ కోఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, చెన్నూరు కార్తీక్, మాజీ కౌన్సిలర్ రాము యాదవ్ లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం పాత ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని వారు విమర్శించారు. బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పథకాలు నిలిచిపోయాయని, ఉపాధి అవకాశాలు తగ్గాయని, విద్య, సంక్షేమ రంగాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని వారు తెలిపారు. బీసీలకు గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 56 కార్పొరే షన్లు ఏర్పాటు చేసి 56 మంది చైర్మన్ లను నియమించడం జరిగిందన్నారు. బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డి దే అన్నారు. ఎన్నికలకు ముందు బీసీలకు అవి చేస్తాం ఇవి చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయు డు వాటిని తుంగలో తొక్కారని వారన్నారు.బీసీ వర్గాల హక్కుల కోసం గళమెత్తే వేదికగా ఈ బీసీ గళం సభ నిలవనుందని వారు తెలిపారు .నియోజ క వర్గం ఉన్న బీసీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ బహిరంగ సభలో బీసీ వర్గాల సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వబడు తుందని తెలిపారు. ప్రతి బిసి కార్యకర్త ఒక సైనికుడులా సభకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## అగస్తేశ్వర ఆలయ అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి

### - దేవాలయ సంరక్షణ సమితి



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్ ఏప్రిల్ 24): ప్రొద్దుటూరు పట్టణంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ అగస్తేశ్వరాలయములో అమ్మవారి ఆభరణలతో పాటు వెండి నగలు మరియు రూ. కోటి మాయమైన సంఘటనలో ఎండోమెంట్ శాఖ అధికారులు దోషులను గుర్తించడంలో జాప్యం చేస్తుండటం పట్ల దేవాలయాల సంరక్షణ సమితి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. గతంలో ఈడిలుగా పనిచేసిన శంకర బాలాజీ' మరియు రామచంద్రాచార్యులు హయాంలో ఈ అక్రమాలు జరిగాయని ఆలయ ఛైర్మన్ పూజారులతో పాటు భక్తులందరూ ఆరోపిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం కంటితుడుపు చర్యగా నామ మాత్రపు విచారణ జరిపి చేతులు దులుపుకోవాలని చూస్తుండటం చాలా దుర్మార్గం అని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రొద్దుటూరు తాసిల్దార్ గంగయ్య కు వినతిపత్రం అందించి అగస్తేశ్వర ఆలయాన్ని పరిరక్షించాలని అక్రమాలకు పాల్పడ్డ అధికారులను కఠినంగా శిక్షించాలని వినతిపత్రం అందజేశారు.

## జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్ ఏప్రిల్ 24): పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు అని కొత్తపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ కొనిరెడ్డి మాట్లాడుతూ, పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు అనే మాటలను నిజం చేస్తూ, 22 నెలల పాలనలో ఎన్నడూ లేని రీతిలో నూతన సంస్కరణలతో, గ్రామ స్వరాజ్యం దిశగా వడివడిగా అడుగులేస్తూ, అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ దూసుకెళ్తుందని అన్నారు. ఈ ఉద్యమంలో భాగస్వామ్యమైన ప్రజలకు, గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, పంచాయతీరాజ్ శాఖ అధికార యంత్రాంగానికి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చాలన్న ప్లాన్ రివర్స్





వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహి న్యూస్ ఏప్రిల్ 24): తన ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చాలన్న ప్లాన్ రివర్స్ కావటంతో హత్యాయత్నం కేసులో మొత్తం 11 మంది ముద్దాయిలను ప్రొద్దుటూరు పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే, తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని భర్తను చంపటానికి ప్రియుడితో కలిసి 9 మంది కిరాయి హంతకులకు సిఫారి ఇచ్చిన భార్య శిల్ప. లింగాపురం గ్రామానికి చెందిన ఈశ్వర్ రెడ్డి భార్య శిల్ప ప్రభుత్వ ఆసుపత్రిలో అటెండర్ గా పనిచేస్తున్న నాగ సుధీర్ తో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది, తన భర్త ఈశ్వర్ రెడ్డిని చంపటానికి శిల్ప ఆమె ప్రియుడు నాగ సుధీర్లు రాజుపాలెం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన రౌడీషీటర్ విజయ్ కు 10 లక్షల రూపాయల బంపర్ ఆఫర్ ఎరగవేసి కత్తులు మారనాయుధాలతో చంపటానికి కుట్ర పన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రొద్దుటూరు స్థానిక ఎం ఎం టి ఫంక్షన్ హాల్ వద్ద రెండు కార్లలో ఈశ్వర్ రెడ్డిని కారుతో గుద్ది చంపటానికి ప్రయత్నం చేయగా, తప్పించుకున్న ఈశ్వర్ రెడ్డిని కత్తులు రాడ్లతో వినయ్ అండ్ గ్యాంగ్ వెంబడించింది. హత్యాయత్నం నుండి తప్పించుకున్న ఈశ్వర్ రెడ్డి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు మొదలుపెట్టి హత్యాయత్నం కేసును గంట వ్యవధిలోనే ఛేదించి శిల్ప, ఆమె ప్రియుడు సుదీర్, రౌడీషీటర్ వినయ్ తో సహా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని మొత్తం 11 మందిని విచారణ అనంతరం రిమాండ్కు ప్రొద్దుటూరు పోలీసులు తరలించారు.



# బీటెక్ రవి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు

### రైతుల కోసం ప్రజల కోసం శ్రమించే నాయకుడు ఎంపీ అవినాష్ రెడ్డి

### అవినాష్ రెడ్డిని ఇష్టానుసారంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదు

### లింగాల మండల వైకాపా నాయకులు



పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 24: బీటెక్ రవి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాల ని, రైతుల కోసం, ప్రజల కోసం శ్రమించే నాయకు డు వైఎస్ అవినాష్ రెడ్డి అని లింగాల మండల కన్వీనర్ అంబకపల్లె బాబు రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగపు అధ్యక్షుడు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి లు అన్నారు. శుక్రవారం జగన్ క్యాంపు కార్యాల యం లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిన్నటి రోజున ఎంపీ అవినాష్ రెడ్డి లింగాల మండల రైతులు వేముల మండలం రైతులు చెరువులకు నీళ్లు వదలాలని అధికారుల తో మాట్లాడేందుకు వస్తే ఆయనను అభినందించా ల్సిన బీటెక్ రవి నోరు ఉంది కదా, అధికారం ఉంది కదా అని నీవు కొవ్వు పట్టి విర్రవీగుతున్నామని ఎంపీ కాదని వారన్నారు. చేతనైతే రైతులకు మేలు జరిగే విధంగా చేయాల తప్ప ఇష్టానుసారంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని వారు హితవు పలికారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ప్రజలకు మేలు చేస్తే ఆ పేరు శాశ్వతంగా నిలబడి పోతుందని వారన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చేస్తున్న మంచి పనులను చూసి మీరు ఓరవలేక నువ్వు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నావని వారన్నారు. అధికారం ఉండి కూడా ప్రభుత్వంతో మీరు డబ్బులు మోటార్లకు పెట్టించలేకపోతే ఎంపీ సొంత నిధులు పెడతాననడం తప్పేముందన్నారు. చేతనైతే నువ్వు పెట్టు అంతేకానీ పనిచేసే వారిని చేయ నివ్వకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం పద్ధతి కాదన్నారు. వారం రోజుల లోపల మేము చేపిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నావని వారం రోజుల లోపల ఏ విధంగా చేపిస్తావని 15 లక్షల కట్టేందుకే తల ప్రాణం తోకకు వచ్చింది అన్నావు కదా, మళ్లీ రైతులకు ఏ విధంగా న్యాయం చేస్తావని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా మంచి పనులు చేసే వారిని ప్రోత్సహించాలి తప్ప నోరు ఉంది కదా అని అదుపుతప్పి మాట్లాడకూడదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సూర్యనారాయణ రెడ్డి,బాబా హుస్సేన్, వైకాపా నాయకులు నాగేందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, గంగాధర్ రెడ్డి,నాగేశ్వర్ రెడ్డి, గుణకనపల్లె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com